Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 14.06.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 02 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com





## విశ్వసనీయతకు...

# బహుమానం

### అనుభవం కంటే అభిమానంకు పెద్దపీట
### యువకులే జిల్లా అమాత్యులు, ఇద్దరికీ కీలక శాఖలు
### సామాజిక కోణంలో జిల్లాలో తొలి బి.సి మంత్రి
### జిల్లాలో అభివృద్ధికి కొత్త దారులు

(వివరాలు 11వ పేజీలో)

విధేయతకు ఇరిగేషన్

త్యాగాలకు పరిశ్రమలు



- రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అబ్బురం
- జగన్ ధైర్యానికి నోర్లు తెరచిన మేధావులు
- మాట నిలబెట్టుకోవడంలో తండ్రిని మించిపోయాడని ప్రశంసలు

# సామాజిక సాహసం!

"నేను అధికారంలోకి వస్తే బడుగుబలహీన వర్గాలకు పెద్దపీట వేస్తాం... మైనార్టీలకు, దళితులకు పదవుల్లో ప్రాధాన్యతనిస్తాం... ఎన్నో ఎన్నికలను చూసాం.." ఎంతోమంది నాయకుల నోట ఇలాంటి హామీలను విన్నాం... విని విని అందరికీ అలవాటైపోయింది. అని అని... నాయకుల నోటికి కూడా ఆ డైలాగ్ అలవాటైంది. రాజకీయాలలో ఇప్పుడు ఆ డైలాగ్ వింటుంటే... ఇలాంటి హామీలని నమ్మే పిచ్చి జనాలు ఇంకా ఉన్నారా అనిపించేది. కాని దేశ రాజకీయ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆ హామీకి ప్రాణం వచ్చింది.

(మిగతా 10వ పేజీలో)


# N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
## (AUTONOMOUS)
Affiliated to JNTUA, Anantapuramu

Vidyanagar, S.P.S.R. Nellore Dt. Phone : 08624 - 228247.

Estd: 1979

EAMCET CODE
**NBKR**

WEBSITE
www.nbkrist.org

COURSES OFFERED

IT/CSE/ECE/EEE/CIVIL/MECHANICAL

INFORMATION CENTRES

**NELLORE**
CHANDRA REDDY DEGREE COLLEGE
(Near VRC) 9441443136, 9492532353)
LLF SCHOOL
(Vedayapalem) 9491076300, 8500767195)
VEDAVYASA SCHOOL
(Magunta Layout) 9959822821, 9493915852)

**GUDUR**
SWARNANDRA BHARATHI JR COLLEGE
(9491170916, 9494301638)

**NAIDUPETA**
SRI VEMA JR COLLEGE
(9491351267, 9441567698)

**SULLURUPETA**
SRI SATHYAM JR COLLEGE
(9440890235, 9490096093)

**VENKATAGIRI**
ESS DEGREE COLLEGE
(9963233414, 9441057392)

**SRIKALAHASTI**
THE SCHOOL
(9441393863, 9490250405)

**TIRUPATI**
COVALENT IIT&NEET MEDICAL ACADEMY
( M.R. Palli Circle 9494494393, 7382442543)

## నెల్లూరు కబుర్లు

### మంత్రులకు...
# భారీ స్వాగత సన్నాహాలు

రాష్ట్ర మంత్రివర్గంలో నెల్లూరుజిల్లా నుండి చోటు దక్కించుకున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలకు మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా సొంత జిల్లాకు వచ్చే తరుణంలో భారీగా స్వాగతం పలికేందుకు వారి అనుచరులు, అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో పి.అనిల్‌కుమార్‌యాదవ్ జలవనరుల శాఖ మంత్రిగా, మేకపాటి గౌతమ్‌రెడ్డి పరిశ్రమలు, వాణిజ్యపన్నుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రులుగా వీరి ప్రమాణస్వీకారోత్సవానికి 8వ తేదీన భారీసంఖ్యలో వారి అనుచరులు, నెల్లూరు నగరం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల వైసిపి కార్యకర్తలు అమరావతికి వెళ్లారు. ఏ ప్రభుత్వంలోనైనా జిల్లా నుండి మంత్రి పదవులు అందుకున్న వాళ్ళు తొలిసారి సొంత జిల్లాకు వచ్చినప్పుడు భారీ ర్యాలీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే అనిల్‌కు, గౌతమ్‌లకు ఆ విధంగా స్వాగత సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీ ఇద్దరు మంత్రులు కూడా జిల్లాకు వచ్చే అవకాశముంది. అయితే మంత్రి అనిల్ మాత్రం తన బాస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆర్భాటాలకు తావు లేకుండా కేవలం అభిమానంతో వచ్చిన ప్రజలతోనే ర్యాలీ నిర్వహించాలని భావిస్తున్నారు.

### 'నుడా' ఛైర్మెన్ పదవికి
# శీనయ్య రాజీనామా



నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ఛైర్మెన్ పదవికి తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి రాజీనామా చేశారు. నిన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయి వైసిపి అధికారంలోకి రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయనతో పాటు 'నుడా' డైరెక్టర్లు కూడా తమ పదవులకు రాజీనామాలు చేశారు. దాదాపు రెండేళ్ళ క్రితం నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థను తొలిసారిగా ఏర్పాటు చేయడం జరిగింది. తొలి ఛైర్మెన్ పదవి కోసం టిడిపిలో పలువురు నాయకులు పోటీపడ్డప్పటికీ అప్పట్లో తన అభిమాన హీరో నందమూరి బాలకృష్ణ సహకారంతో శీనయ్య 'నుడా' ఛైర్మెన్ పదవిని తెచ్చుకోగలిగాడు. తన హయాంలో నెల్లూరు నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయాలని, ఫ్లైఓవర్లు నిర్మించాలని కలలు కన్నాడు. అయితే ఆయన కాలంలో నక్లెస్‌రోడ్డుతో పాటు నగరంలో పెద్దఎత్తున పార్కులు పూర్తి కావడం ఆనందించాల్సిన విషయం.

### ఆర్యవైశ్య విద్యార్థులకు
# ఉచిత భోజన వసతి

2019-20 విద్యాసంవత్సరానికి 6 నుండి డిగ్రీ మరియు ఇంజనీరింగ్ చదివే పేద ఆర్యవైశ్య విద్యార్థులకు నెల్లూరు పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన మాజం ఆధ్వర్యంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు సమాజం కార్యదర్శి నీలిశెట్టి వెంకటేశ్వర్లప్రసాద్, అధ్యక్షులు కొండా ప్రవీణ్‌కుమార్, హాస్టల్ కమిటి ఛైర్మెన్ తవ్వా శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి విద్యార్థులు అన్నదాన సమాజ మందిరం నందు సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

# ఆదాలకు అభినందనలు తెలిపిన ఆలీం బాషా



ఆదాలతో చర్చిస్తున్న కమిషనర్ ఆలీం బాషా, రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీం బాషా 11వ తేదీ నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీగా గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్ యాదవ్, జిల్లా బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు ఆదాలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# మంచి ఫలితాలు చూపిస్తా..!

**- కలెక్టర్ శేషగిరిబాబు**



గ్రీవెన్స్ డేలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు

జిల్లాలో మంచి పని తీరుతో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు చెప్పారు. 10వ తేదీ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌డే ముగిసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాలలో వున్న ప్రధాన సమస్యలపై అధ్యయనం చేస్తున్నామని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. గత కలెక్టర్ ముత్యాలరాజు చేపట్టిన సంస్కరణలను కొనసాగిస్తూనే ప్రజాప్రయోజనాల దృష్ట్యా కొత్త సంస్కరణలు చేపడతానన్నారు. జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు కృషి చేస్తానని, ప్రభుత్వం 80వేల పనిదినాలను కేటాయించిందని, దానిని లక్ష పనిదినాలకు పెంచేందుకు ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను పరిశీలించి, వాటి పూర్తికి కృషి చేస్తానన్నారు. ఈ వేసవిలో జిల్లా వ్యాప్తంగా 312 గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా వున్నట్లు తన దృష్టికొచ్చిందని, ఈ గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు మంచినీటిని అందిస్తున్నట్లు వెల్లడించారు. కరువు పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో పశువులకు లక్ష మెట్రిక్ టన్నుల దాణా అవసరముందని, జిల్లాలో కొరత పడితే చిత్తూరు, ప్రకాశం జిల్లాల నుండి కూడా దాణా తెప్పిస్తామన్నారు. ప్రజల సమస్యలను మండలస్థాయిలోనే పరిష్కరించేలా చేస్తానని, దీనివల్ల బాధితులు వ్యయప్రయాసల కోర్చి నెల్లూరు వరకు వచ్చే బాధ తప్పుతుందని చెప్పారు.

# యంసీఏ ఫలితాల్లో కృష్ణచైతన్య ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

విక్రమ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన యంసీఏ ఐదవ సెమిష్టర్ ఫలితాల్లో కృష్ణ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మొదటిస్థానం సాధించారని కళాశాల డైరెక్టర్లు డా. ఆర్ వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. యంసీఏ ఐదవ సెమిష్టర్ ఫలితాల్లో షేక్.ముసవ్వీర్ 699మార్కులతో యూనివర్సిటీ మొదటి స్థానం సాధించగా, లంకా సుస్మిత, లంకా తనూజ 698 మార్కులతో రెండవ స్థానంలో నిలిచారని, ప్రతి సెమిష్టర్, ప్రతి గ్రూప్ లోను కృష్ణ చైతన్య విద్యార్థులు ర్యాంకులు సాధించడం ఆనందంగా వుందన్నారు. కళాశాలలో జరిగే అకడమిక్ ప్రోగ్రాం, కరికులమ్ ఈవెంట్స్ వారాంతపు పరీక్షలు దీనికి కారణమన్నారు. యంసీఏ విద్యార్థులకు విప్రో వంటి టాప్ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ప్రాంగణ ఎంపికలను జరిపి విద్యార్థులు చివరి సంవత్సరంలో ఉద్యోగం పొందేటట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో, మిఠాయిలతో అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్స్ యు.మల్లికార్జునయ్య, టి.జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి

నెల్లూరు జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని, బ్యాడ్మింటన్ క్రీడాహబ్‌గా నెల్లూరు మారబోతుందని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. ఈనెల 10న నెల్లూరు ఏసీ స్టేడియం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ అకాడమీ ఎంపికలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఇప్పటికే పలు రకాల జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా వేదికయ్యిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో 13 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను అభినందించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

# నెల్లూరులో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న వైసిపి అభిమానులు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో నెల్లూరు నగరంలో వైసిపి కార్యకర్తలు, అనిల్ అనుచరులు భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

# వేగంగా మూడోలైను పనులు



నెల్లూరు నగర పరిధిలో మూడో రైల్వేలైను పనులు చాలా వేగవంతంగా జరుగుతున్నాయి. పెన్నానదిలో మూడో రైల్వేబ్రిడ్జి నిర్మాణం చకాచకా జరుగుతోంది. దీనికోసం ప్రత్యేక యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. అలాగే ట్రాక్ పనులు, నగర పరిధిలోని అండర్ బ్రిడ్జిల వద్ద కొత్త ట్రాక్ కోసం వంతెనల పనులు జోరుగా సాగుతున్నాయి. పలుచోట్ల మూడో రైల్వేలైన్ కోసం ఏర్పాటు చేసిన గ్రావెల్ ట్రాక్‌లు మార్నింగ్ వాకర్స్‌కు మంచి వాకింగ్‌ట్రాక్‌లుగా ఉపయోగపడుతున్నాయి.

# పొంచివున్న ప్రమాదం



టెక్కేమిట్టలో ప్రమాదకరంగా వున్న కాలువ

నెల్లూరు టెక్కేమిట్టలో అసంపూర్తిగా మిగిల్చిన రోడ్డు వాహనదారులకు, పాదచారులకు, పశువులకు ప్రమాదకరంగా మారింది. టెక్కేమిట్టలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల పనుల కోసం వున్న రోడ్డును తవ్వారు. కొత్తరోడ్డు కూడా వేశారు. అయితే నలంద అపార్ట్‌మెంట్ ముందు సిమెంట్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వుంది. ఇక్కడ డ్రైనేజీ కాలువ తెరచి వుంది. ముందు కాలువ వుందనే ఊహే లేని వాహనదారులు వేగంగా వచ్చి ఇక్కడ అదుపుతప్పి పడిపోయే ప్రమాదముంది. కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టిపెట్టి వెంటనే దీనిని పూర్తి చేయాల్సివుంది.

# తెరచుకున్న బళ్ళు



దాదాపు 50 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12వ తేదీ బుధవారం నుండి తిరిగి తెరచుకున్నాయి. వేసవి సెలవుల్లో ఆటలు, పాటలతో, విహారయాత్రలతో గడిపిన విద్యార్థులు ఇన్ని రోజులుగా మూలనపడేసిన బూట్లను, స్కూల్ యూనిఫారాలను తిరిగి తీశారు.

# మాఫియాకు చెల్లుచీటీ!

## ○ ఇసుకపై కొత్త పాలసీ...



2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇసుక రీచ్‌లకు టెండర్ల విధానం వుండేది. జిల్లాలో పెన్నా పరీవాహక ప్రాంతంలో అధికారికంగా 14రీచ్‌లున్నాయి. వీటిలో పొట్టేపాలెం, జొన్నవాడ, పోతిరెడ్డిపాలెం, ముదివర్తి, ముదివర్తి పాలెం, పడమటి కంభంపాడు, సంగం, అన్నారెడ్డిపాలెం వంటి రీచ్‌లకు టెండర్లలో పోటీ వుండేది. టెండర్లలో రీచ్‌లను దక్కించుకున్న వాళ్ళు వినియోగదారులకు ఇసుకను యూనిట్ల లెక్కన అమ్ముకుంటుండేవాళ్ళు. ఇలా టెండర్ల విధానం వున్నప్పుడు కూడా ట్రాక్టర్ ఇసుక వినియోగదారుడిని చేరేరోజుకు వెయ్యిరూపాయలెప్పుడూ మించలేదు.


2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఇసుక రీచ్‌లపై కొత్త పాలసీ తీసుకొస్తామని చెప్పింది. తీరా ఇసుక ఫ్రీ అంది. వినియోగదారులు చంకలు గుద్దుకుని సంబరపడ్డారు. కాని ఫైనల్‌గా చూస్తే ఇసుకరీచ్‌లన్నీ అధికారపార్టీ నాయకుల చేతుల్లోకి వెళ్ళిపోయాయి. ఇసుక రీచ్‌లలో మాఫియా చెలరేగిపోయింది. పేరుకు ఉచితమే అయినా మాఫియా ముసుగులో వసూళ్ళు మొదలయ్యాయి. ఒక ట్రాక్టర్ ఇసుక రెండువేలు దాటింది. అంతేకాదు, టిప్పర్లు పెట్టి పక్క రాష్ట్రాలకు కూడా ఇసుకను భారీఎత్తున తరలించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారు.

జిల్లాలో పెన్నానది, స్వర్ణముఖి, కాళంగి నదుల నుండి అక్రమ ఇసుక రవాణా యధేచ్ఛగా సాగింది. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించి కూడా ఇసుక తవ్వకాలు జరిగాయి. జిల్లాలోని గృహావసరాల కంటే కూడా అప్పటి తెలుగుదేశం నాయకుల ధన దాహంతో పక్క రాష్ట్రాలకు ఇసుక రవాణా ఎక్కువగా జరిగింది.

ప్రభుత్వం ఇసుకపై ఒక పాలసీ తెస్తే అది ప్రజలకు ఉపయోగపడే విధంగా వుండాలి. తెలుగుదేశం ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది.

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన వైసిపి ప్రభుత్వం గత ప్రభుత్వ ఇసుక పాలసీని రద్దు చేసింది. ఇసుక రీచ్‌లను మాఫియా చేతుల్లోకి పోకుండా ప్రభుత్వ ఆధీనంలోనే ఇసుక డిపోలను ఏర్పాటు చేసి గృహ నిర్మాణాలు, ఇతర నిర్మాణాలకు వీలైనంత కనీస ధరకే ఇసుకను అందించేలా కొత్త పాలసీ తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. బహుశా జూలై మొదటి వారంలోనే ఈ పాలసీ రావచ్చు కూడా!

## ఇక...
# చందమామతో చెలిమి




- మొదటిసారి చంద్రునిపైకి భారత్ రోవర్
- జులై 15న చంద్రయాన్-2
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం
- విజయంపై నమ్మకంతో ఇస్రో శాస్త్రవేత్తలు

*ఏదో ఒకరోజు మనం కూడా ఆ అందాల జాబిల్లిని దగ్గరగా చూసే రోజొకటి తప్పకుండా వస్తుందని శాస్త్రవేత్తలు అప్పుడప్పుడూ చెప్తూనే ఉండేవారు. అంతరిక్ష శాస్త్ర విజ్ఞానం శరవేగంగా విస్తరిస్తున్న నేటి రోజుల్లో అలాంటి క్లిష్టమైన ప్రయోగాలు సైతం సాధ్యమయ్యేలా శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఆ దిశగా అంతరిక్ష ప్రయోగాల పరంపర అవిశ్రాంతంగా కొనసాగుతూనే ఉన్న నేపథ్యంలో.. అందరి కలలను సాకారం చేస్తూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే నెల 15న చంద్రయాన్-2 పేరుతో అత్యంత ప్రతిష్టాత్మక ప్రయోగానికి శ్రీకారం చుట్టబోతోంది.*

ఈ ప్రయోగం ద్వారా చందమామ రూపురేఖా విలాసాలు క్షుణ్ణంగా తెలుసుకునేందుకు వీలుంటుంది. అంతేకాదు చంద్రునిపై ఇంతవరకు ఏ వాహకనౌక చేరుకోని ప్రాంతంలో భారత్ రోవర్ దిగబోతోంది. చందమామ ఉపరితలంపై పరిశోధనలు చేయడానికి వీలుగా ఈ ప్రయోగం ఉంటుంది. అందుకే, చంద్రయాన్-2 యాత్ర ఒక సంచలనం కాబోతోంది. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకునే రీతిలో ఈ ప్రయోగం ఉండబోతోంది కూడా.

జులై 15 వేకువన 2.51 గంటలకు ప్రారంభమయ్యే ఈ అంతరిక్షయాత్రలో ఉపగ్రహ వాహకనౌక చంద్రుని వైపు ప్రయాణిస్తుంది. ఆమేరకు జీఎస్ఎల్‌వి మార్క్-3 ఉపగ్రహ వాహకనౌక జులై 15న శ్రీహరికోట నుంచి ప్రయాణం ప్రారంభించి 5 రోజుల తర్వాత భూ నియంత్రిత కక్ష్యలోనికి ప్రవేశించి, అనంతరం 3.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రుని వైపు ప్రయాణిస్తుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ తర్వాత రాకెట్ నుంచి విడివడి ఆర్బిటర్, రోవర్, ల్యాండర్లు చంద్రుని దక్షిణ ధృవం వైపు మళ్ళుతాయి. చంద్రునికి 30 కిలోమీటర్ల దూరంలో ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విడిపోతుంది. ఈ దశలన్నీ దాటిన తర్వాత చివరిగా ల్యాండర్ ద్వారాల నుంచి బయటకు వెళ్ళే





చంద్రునిపై భారత్ రోవర్
(ఊహాచిత్రం)

రోవర్ చంద్రుడిపై చేరి 4గంటల తర్వాత ప్రయోగాలు మొదలు పెడుతుంది. అలా శాస్త్రవేత్తలు ఆ ప్రయోగాన్ని సిద్ధం చేస్తున్నారు. గతంలో అంటే 2008లో చంద్రయాన్-1 ప్రయోగించినా అది పూర్తిస్థాయి లక్ష్యాన్ని సాధించలేకపోయింది. దీంతో ఇస్రో ఈ ప్రయోగాన్ని ఒక సవాల్‌గా తీసుకుని తాజాగా చంద్రయాన్-2 ప్రయోగానికి రూపకల్పన చేసింది. ఈ ప్రయోగంలో అన్ని దశలూ పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు చేస్తోంది. అందులోనూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన చంద్రయాన్-2 ద్వారా ఇక చంద్రునికి సంబంధించిన విషయాలన్నీ సమగ్రంగా పరిశీలించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇస్రో నుంచి జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో దిగ్విజయం కావాలని.. అంతరిక్ష రంగంలో భారత్ కీర్తిపతాకం రెపరెపలాడాలని అందరం మనసారా కోరుకుందాం!...

# నేరాల కట్టడికి సరికొత్త యాప్

**- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**

నేరాల నియంత్రణకు సరికొత్తగా ఒక యాప్‌ను రూపొందిస్తామని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో దీనిని రూపొందించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి చెప్పారు. ఈ నెల 12న జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ యాప్‌లో ఎన్నో సౌకర్యాలుంటాయని, నేరుగా ఈ యాప్‌ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, సమస్యకు సంబంధించిన చిత్రాన్ని పోలీసులకు అందజేయవచ్చని పేర్కొన్నారు. మరో 10 రోజుల్లో దీనిని ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాల వల్ల ఎంతో ప్రయోజనం ఉందని, ఎన్నో కేసులను ఈ కెమెరాల ద్వారానే పరిష్కరించగలిగామని, ప్రజలు కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**మద్యంతో ఎన్నో అనర్థాలు :**

మద్యంతో ఎన్నో అనర్థాలు కలుగుతాయని, దీనిని నివారించేందుకు పటిష్ట



మైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని, ఇటీవల చేపట్టిన డ్రైవ్‌లో మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా 300 మందిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించామని, రద్దీ ఎక్కువగా ఉన్న ఆత్మకూరు బస్టాండ్ సెంటర్, విఆర్‌సి, మద్రాసు బస్టాండ్, ఆర్టీసి బస్టాండ్ సెంటర్లలో సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఇక్కడ లౌడ్‌స్పీకర్లు కూడా ఏర్పాటుచేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. క్రమశిక్షణ పాటించాలని ఆటోడ్రైవర్లకు ఇప్పటికే సూచించామన్నారు. విచ్చలవిడి డ్రైవింగ్‌ను అదుపు చేసేందుకు, త్రిబుల్‌రైడింగ్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బందోబస్తు, ఇతర విధుల నిమిత్తం జిల్లా నలుమూలల నుంచి వచ్చే సిబ్బందికి ఇబ్బంది లేకుండా 20 మందికి ఉపయోగపడేలా పాత జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.




## 'ప్రభా'తం

# మానవమృగాలకు.. సరైన దండన!

**దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన కరువా ఘటనలో, ఎనిమిదేళ్ళ బాలికను అపహరించి, అత్యంత ఘోరంగా అత్యాచారం చేసి, హత్యచేసిన కేసులో ఆరుగురు దోషులకు కోర్టు కఠినదండన విధించింది. ప్రధాన నిందితులైన ముగ్గురికి యావజ్జీవ శిక్ష విధించడంతో పాటు, మరో ముగ్గురికి అయిదేళ్ల జైలుశిక్ష పడింది. అత్యంత దారుణమైన ఇటువంటి ఘటనలకు పాల్పడిన కర్కోటకులకు ఎలాంటి శిక్ష విధించినా పాపం లేదు. శిక్షలు ఇంకా కఠినంగా ఉంటే తప్ప ఇలాంటి అకృత్యాలు ఆగవు!..**

కరువా..ఈ మాట వింటేనే చాలు, మానవత్వం ఉన్నవారెవరికైనా కన్నీళ్ళు ఆగక మానవు. జమ్మూలోని కరువాలో ఆసిఫా అనే ఎనిమిదేళ్ళ అమాయక బాలికపై మానవమృగాలు చేసపట్టిన రాక్షసకాండ పైశాచికత్వానికే పరాకాష్టగా చెప్పుకోవచ్చు. అత్యంత అమానవీయమైన..అమానుషమైన ఘటన ఇది. ఆ బాలికను అపహరించి తీసుకువెళ్ళి, మాటల్లో చెప్పలేనంత పాశవికంగా అత్యాచారం జరిపి హతమార్చారు. గత ఏడాది జరిగిన ఈ ఘటనలోని నిందితులకు పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రత్యేక న్యాయస్థానం సరైన శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం ఎంతైనా హర్షదాయకం. ఈ కేసులో ఆరుగురు నిందితుల్ని దోషులుగా కోర్టు నిర్ధారించింది. ప్రధాన నిందితులైన సాంజీరాంతో పాటు మరో ఇద్దరు నిందితులకు యావజ్జీవ శిక్ష విధించడంతో పాటు, ఈ ఘటనకు సంబంధించిన సాక్ష్యాధారాలను నాశనం చేయడానికి ప్రయత్నించిన మరో ముగ్గురికి అయిదేళ్ల జైలుశిక్షతో పాటు 50వేల వంతున జరిమానా కూడా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితుడైన సాంజీరాం కుమారుడుని కోర్టు నిర్దోషిగా ప్రకటించగా, మరో నిందితునికి మైనారిటీ తీరలేదని జువైనెల్ కోర్టులో విచారణ చేస్తున్నారు.

కరువా జిల్లాలో సంచారజాతి వారిని భయోత్పాతానికి గురిచేసి వారిని అక్కడినుంచి తరిమేయాలన్న కుత్సిత పన్నాగానికి ఆ బాలిక బలైపోయిందనే ఆవేదన అప్పట్లో దేశంలో వెల్లువెత్తింది కూడా.

అమాయకురాలైన ఎనిమిదేళ్ళ ఆసిఫా అనే బాలికను నిందితులు దారుణంగా హింసించి మత్తు పదార్థాలు ఇచ్చి నాలుగురోజుల పాటు అత్యంత హేయమైన రీతిలో అత్యాచారం జరపడం, ఆ తర్వాత రాళ్ళతో కొట్టి చంపడం ఎంత ఘోరం?.. గత ఏడాది జరిగిన ఈ దారుణం దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ అమానవీయమైన సంఘటన దేశం మొత్తాన్ని కంటతడి పెట్టించింది. ఆ బాలికకు కనీసం అన్నం పెట్టకుండా ఆకలితో మాడ్చి, మత్తుపదార్థాలతో మత్తులో ముంచి, ఆ పై సామూహిక అత్యాచారం చేసి అప్పటికీ కసిదీరదన్నట్లుగా బండరాయితో కొట్టి చంపిన ఘోరాతిఘోరమైన ఘోరం ఇది. ఇంతకంటే కర్కోటకత్వం.. పైశాచికత్వం ఎక్కడైనా ఉంటుందా?.. ఆ దోషులకు ఎంతటి శిక్షలు వేసినా చాలదు. ఇంతటి అకృత్యానికి ఒడిగట్టిన దుండగులు మరెవరో కాదు.. ఒకరేమో అక్కడ ఓ ప్రార్థనామందిరానికి సంరక్షకుడట కూడా. దోషులుగా న్యాయస్థానం నిగ్గుతేల్చిన వారిలో పోలీసులు కూడా ఉన్నారంటే ఏమనుకోవాలి?... సాక్ష్యాధారాలు ధ్వంసం చేయడానికి, తద్వారా న్యాయం కళ్ళు కప్పేందుకు ప్రయత్నించిన వీరందరికీ శిక్షలు పడ్డాయి. బాలికపై సామూహికంగా అత్యాచారం చేసి, ఆ తర్వాత అత్యంత దారుణంగా చంపేసిన ఆ ముగ్గురు కర్కోటకులకు కోర్టు కఠిన దండనే విధించింది. హత్య చేసినందుకు యావజ్జీవ కారాగారశిక్ష, సామూహికంగా అత్యాచారం చేసినందుకు మరో పాతికేళ్ళు జైలులోనే శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పడం నేరస్తులకు తగిన గుణపాఠం చెప్పినట్లే అయ్యింది. ఈ పైశాచికులంతా చచ్చేదాకా జైల్లోనే మగ్గాల్సి ఉంటుంది. వీరితో పాటు, నిందితుల వద్ద లంచం తీసుకుని సాక్ష్యాధారాలు ధ్వంసం చేసేందుకు సహకరించిన నేరానికి ముగ్గురు పోలీసు అధికారులకు కోర్టు అయిదేళ్ళ కారాగార శిక్ష విధించడంతో పాటు 50వేల వంతున జరిమానా కూడా వేయడం జరిగింది. అయితే, విధి నిర్వహణలో అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, కర్కోటకులైన ఆ నేరస్తులకు వీరు సహకారం అందించడం మరింత ఘోరం!.. ఇలాంటివారికి అంతకంటే కఠిన దండన ఉండాల్సింది. మతపరమైన ఆవేశంతో అప్పట్లో ఈ కేసుకు సంబంధించి అభియోగపత్రాలను కూడా దాఖలు చెయ్యనివ్వకుండా జరిగిన దుష్కృత్యాలు చెప్పనలవి కాదు. ఎట్టకేలకు సుప్రీంకోర్టు జోక్యంతో ఈ కేసు పఠాన్‌కోట్‌కు వెళ్ళడంతో ఇప్పటికైనా ఒక కొలిక్కి వచ్చింది. ఆ ఆరుగురు కర్కోటకుల్నీ ఉరితీయాలని జాతీయ మహిళాసంఘంతోపాటు బాధితురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు కూడా. ఏడవ నిందితుడి విషయం ఇంకా విచారణలో ఉంది.

ఇలాంటి ఘటనల్లో సత్వర విచారణ, సత్వర న్యాయం అన్నవే ఎంతైనా ముఖ్యం. ఇలాంటి లైంగిక దాడుల నుంచి బాలలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలికాలంలో కఠినమైన చట్టాలను తెచ్చింది. అయినప్పటికీ దేశంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉండడం ఎంతో బాధాకరం! కరువా ఘటనలో ఆ బాలిక పక్షాన వాదించాలనుకున్న న్యాయవాదిపై వచ్చిన వత్తిడులు చూస్తే కేవలం చట్టాలు చేసినంత మాత్రాన్నే ఇలాంటి ఘోరాలు ఆగవని స్పష్టమవుతూ ఉంది. ఎలాంటి ఫీజు లేకుండానే ఆ అభాగ్యురాలి కేసు వాదించడానికి ముందుకొచ్చిన మహిళా న్యాయవాది దీపికాసింగ్ రజావత్‌కు వచ్చిన బెదిరింపులకు లెక్కేలేదంటే ఏమనుకోవాలి?..

అయితే, మనదేశంలో నిబంధనలకు కొదవే లేదు. కానీ సుపరిపాలన అన్నది కొరవడినప్పుడు చట్టాలు కూడా చట్టుబండలైపోతున్నాయని, దేశంలో సామాన్యులకు, అసహాయులకు, అబలలకు, బాలలకు తగు భద్రత లేకుండాపోతున్నదనే నిపుణుల ఆవేదనను ప్రభుత్వాలు ఇకనైనా అర్థం చేసుకోవాల్సి ఉంది. గతంలో నిర్భయ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లుగా ఇలాంటి అత్యంత దుర్మార్గమైన, దారుణమైన నేరాలకు ఘోరాలకు పాల్పడేవారికి ఉరిశిక్షే సరైనది.

ఏదేమైనా, దేశంలో బాలికలపై ఘోరాలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. అమాయకులైన బాలికలను వంచించి హింసించే ఘటనలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరచి ఇలాంటి లైంగికదాడులను ఉక్కుపాదంతో అణచివేయాలి. పసిపిల్లలపై అకృత్యాలకు పాల్పడేవారి పట్ల మరింత కఠినంగా ఉండాలి. అత్యంత దారుణమైన కరువ ఘటనలకు పాల్పడిన కర్కోటకులకు ఎలాంటి శిక్ష విధించినా పాపం లేదు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు ఇలాంటి నేరస్తుల పట్ల మరింత కఠినంగా ఉండాలి. పసిమొగ్గల్ని కాటేసే విషసంస్కృతిని సమూలంగా నాశనం చేయాలి. అలాంటి మానవమృగాలకు శిక్షలు ఇంకా..ఇంకా కఠినంగా ఉంటే తప్ప ఇలాంటి అకృత్యాలు ఒక పట్టాన ఆగనే ఆగవు!..

---

### జాతీయస్థాయిలో...

# బిట్రగుంట ఖ్యాతిని నిలబెట్టాలి

**- జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ చీఫ్ పాండు**

ఫుట్ బాల్ క్రీడలో బిట్రగుంట ఖ్యాతిని జాతీయస్థాయిలో మరలా నిలబెట్టేందుకు కంకణం కట్టాలని జిల్లా క్రీడా ప్రాధికారిత సంస్థ చీఫ్ ఫుట్‌బాల్ కోచ్ పాండు కోరారు. ఈనెల 9న బిట్రగుంట రైల్వే క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బిట్రగుంటలో జాతీయ స్థాయిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో తాను పాల్గొన్న సందర్భాలు మరువలేనివన్నారు. బిట్రగుంట రైల్వే డాక్టర్ హసీనా బేగం మాట్లాడుతూ క్రీడల్లో బాలికలను భాగస్వామ్యం చేయాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న క్రీడను గుర్తించి ప్రోత్సహిస్తే బిట్రగుంటకు మరింత మంచిపేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట ఎస్సై భరత్ కుమార్, డాక్టర్ ఆనందసాగర్, బిట్రగుంట రైలు రహదారిశాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ హుస్సేన్, విశ్రాంత రైల్వే ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎంఎస్ సుబ్బారావు తదితరులు మాట్లాడారు. సీనియర్ వాకర్ శామ్యుయేలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే సుందరరాజన్, మాజీ అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, బొట్టు శ్రీనివాసులు, సిరాజ్, ప్రభాకర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రతినిధి బొట్టు శ్రీనివాసులు తండ్రి చంద్రశేఖర్ రావు జ్ఞాపకార్థం ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందిన 31 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసి, జిల్లా క్రీడా ప్రాధికరాత సంస్థ శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అతిథులు పంపిణీ చేసారు.

---

## 30న పాతూరు మాణిక్యమ్మ సాహితీ పురస్కార సభ

నెల్లూరుకు చెందిన రచయిత్రి పాతూరి అన్నపూర్ణ తల్లిగారైన మాణిక్యమ్మ పేరుతో ప్రతి ఏటా ఇచ్చే రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం ఈనెల 30న నెల్లూరు పురమందిరంలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక సభ్యురాలు పాతూరి అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2017వ సంవత్సరానికి చిత్తలూరి సత్యనారాయణ రచించిన 'నల్ల చామంతి' కవితా సంపుటికి, 2018 సంవత్సరానికి సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రచించిన 'బడి' కవితాసంపుటికి ఈ పురస్కారాలు లభించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆ ఇద్దరు కవులకు ఆరోజు జరిగే పురస్కార సభలో పురస్కారాలు ప్రదానం చేయనున్నామని, సాహిత్యాభిమానులు, కవులు కవయిత్రులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

---




## అనిల్ విశ్వాసానికి ఫలితం దక్కింది

రాజకీయాలలో విశ్వాసం చూపిస్తే వ్యక్తి ఏ స్థాయికి ఎదుగుతాడనేందుకు నేటి ఇరిగేషన్ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఒక ఉదాహరణ. తన రాజకీయ ప్రయాణంలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని నూటికి నూరుపాళ్ళు నమ్మాడు. చచ్చినా బ్రతికినా జగన్‌తోటే అనుకున్నాడు. గత ఐదేళ్లలో ఆ విధంగా తన విశ్వాసాన్ని ప్రదర్శించాడు. జగన్‌కు అంత అభిమానపాత్రుడయ్యాడు కాబట్టే ఈరోజు అనిల్ అత్యంత కీలకమైన ఇరిగేషన్ శాఖకు మంత్రి కాగలిగాడు. అనిల్‌కు మా అభినందనలు.

**జె.పార్థసారథి, నెల్లూరు.**

## ఆదాలకు అభినందనలు

నెల్లూరు లోక్‌సభ సభ్యులుగా భారీ మెజార్టీతో విజయం సాధించిన మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు. ఆదాల వైసిపిలో చేరిన సందర్భంలో అనేక మంది ఆయన ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడారు. అయితే ఆదాల అవేమీ పట్టించుకోకుండా ఎంతో హుందాగా వ్యవహరించారు. తనను విమర్శించిన వారిని పల్లెత్తు మాట కూడా అనలేదు. విమర్శకులందరికీ ప్రజలే బుద్ధి చెప్పారు. ఆదాలను నెల్లూరు ఎంపీగా భారీమెజార్టీతో గెలిపించి, జిల్లా ప్రజలు ఎంతో మంచి నిర్ణయం తీసుకున్నారు.

**డా॥ యస్.బాబురావు, కావలి.**

## కులాధిపత్యం లేని కేబినెట్

వైసిపి అధికారంలోకి వస్తే రెడ్ల రాజ్యం నడుస్తుందంటూ తెలుగుదేశం నాయకులు విషప్రచారం చేశారు. కాని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆ విష ప్రచారాన్ని తిప్పి కొట్టారు. మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బి.సిలకు పెద్దపీట వేసి గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి సాహసమే చేశారు. సామాజిక న్యాయాన్ని మాటల్లో కాకుండా, చేతల్లో చూపించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలి.

**కట్టుపాలెం అశోక్, నెల్లూరు.**

## ఏసి బోగీలు పెంచాలి

ఎండల తీవ్రత దృష్ట్యా రైళ్లలో ఏసి బోగీలను పెంచాల్సిన అవసరం వుంది. వేసవి కాలంలో ఏసికోచ్ ప్రయాణాలకు డిమాండ్ ఎక్కువగా వుంటుంది. డిమాండ్‌కు తగ్గట్లుగా టిక్కెట్లు ఉండడం లేదు. మూడో తరగతి శ్రేణి ఏసి బోగీలను పెంచడం ద్వారా ఎక్కువమందికి ఏసిలో ప్రయాణించే అవకాశం కల్పించవచ్చు.

**జువ్వాది దశయ్య, నెల్లూరు.**

# సీనియర్లు నిరాశ చెందారు?





అందరూ ఊహించినట్లే జిల్లాకు రెండు మంత్రి పదవులు దక్కాయి. బీసీ కోటాలో సీఎం జగన్‌కు అత్యంత విశ్వాస పాత్రుడైన పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి ఖాయమని అందరూ భావించారు. అది జరిగింది. ఇక రెడ్లలో ఒకరికి అనుకున్నారు. దీనికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డితో పాటు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిల పేర్లు ప్రచారంలో పోటీపడ్డాయి. అయితే ఆనం రామనారాయణరెడ్డి ఈ ట్రిప్పులో తనకు పదవి వస్తుందని ఆశలు పెట్టుకోలేదు. ఎందుకంటే జగన్‌కు ఆయనకు మధ్య ఇంకా కొంత గ్యాప్ భర్తీ కావాల్సివుంది. కాకపోతే ఆయనను స్పీకర్‌గా నియమించవచ్చనే వూహాగానాలు వచ్చాయిగాని, దానిపై కూడా ఆయన ఆశలు పెట్టుకోలేదు. ఇక నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేరు రేస్‌లో నుండి కొంచెం ముందుగానే తొలగిపోయింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరు 7వ తేదీ సాయంత్రం దాకా కూడా రేసులో నిలిచింది. ఆరోజు సాయంత్రం కూడా కాకాణికే మంత్రి పదవి అని ఆయనకు ఫోన్ వచ్చిందనే ప్రచారం జరిగింది. ఆయన అనుచరులు సంబరాలకు సిద్ధమయ్యారు. అయితే అనూహ్యంగా మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు ఖరారు కావడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి.

దాదాపు 35ఏళ్ళ నుండి మేకపాటి కుటుంబం రాజకీయాల్లో వుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి శాసనసభ్యుడిగా, ఒంగోలు, నరసారావుపేట, నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా పని చేశాడు. అలాగే వారి కుటుంబం నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి నాలుగుసార్లు శాసనసభ్యుడిగా గెలిచాడు. అయితే ఆ అన్నదమ్ములిద్దరికీ రాని 'మంత్రి' అవకాశం, వారి బిడ్డగా మేకపాటి గౌతంరెడ్డికి వచ్చింది.



## మేకపాటి కుటుంబంలో..

# మొదటి మంత్రి!


మేకపాటి కుటుంబం నుండి వచ్చిన మూడో రాజకీయ నాయకుడు గౌతంరెడ్డి. ఆయన రాజకీయ వయస్సు గట్టిగా ఐదేళ్ళే. 2014 ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ నుండి తొలిసారి పోటీ చేసి గెలుపొందాడు. 2019 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుండి మరోసారి గెలుపొందాడు.

ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి గౌతంరెడ్డి అత్యంత సన్నిహితుడు. జగన్ కాంగ్రెస్‌ను వదిలి వైసిపిని పెట్టినప్పుడు గౌతమ్‌రెడ్డి ఏ పదవిలో లేడు. అయితే నెల్లూరు ఎంపీగా వున్న తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా వున్న తన బాబాయ్ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని జగన్ వెంట నడిపించడంలోనూ, జగన్ కోసం వాళ్ళు తమ పదవులను వదులుకుని ఉపఎన్నికలకు పోయేటట్లు చేయడంలోనూ గౌతంరెడ్డి పాత్ర ఎంతో వుంది. 2011లో కాంగ్రెస్‌ను వదిలి జగన్‌పై నమ్మకముంచి వాళ్ళు ఆయన వెంట నడిచారు. ఆ నమ్మకానికి ప్రతిఫలమే ఈరోజు మేకపాటి కుటుంబంలో మంత్రి పదవి అని చెప్పవచ్చు.

## మెట్ట అభివృద్ధికి...

# మంచి అవకాశం!

- ఇద్దరు మంత్రులపై పెద్ద బాధ్యతలు



నెల్లూరుజిల్లాకు రెండు మంత్రి పదవులు కేటాయిస్తే, రెండూ మంచి శాఖలే ఇచ్చారు. అటు చూస్తే జలవనరుల శాఖ... సాగునీటికి, తాగునీటికి ఎంతో కీలకం. జిల్లాలో పలు సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో వున్నాయి. నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్మాణం పూర్తి కావాల్సివుంది. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడు మంత్రిగా వున్న పి.నారాయణ పలుసార్లు ఈ రెండు బ్యారేజీలను సందర్శించడం, సందర్శించిన ప్రతిసారి కూడా మరో మూడునెలల్లో ఈ బ్యారేజీలను ప్రారంభిస్తామని చెప్పడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. వాళ్ళు అలా చెప్పుకుంటూ పోతుండగానే ఐదేళ్ళు గడిచిపోవడం, ఎన్నికలొచ్చి ప్రభుత్వాలు కూడా మారిపోవడం చూస్తున్నాం. ఈ రెండు బ్యారేజీలు కూడా దాదాపు 70శాతం పనులు పూర్తయిన దశలో వున్నాయి. వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కేబినెట్‌లో అదృష్టం కొద్ది జలవనరుల శాఖ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్‌కే వచ్చింది. రాష్ట్ర ఇరిగేషన్ మంత్రిగా రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎన్నో వుండొచ్చు. దాంతోపాటు సొంత నియోజకవర్గంలో వున్న నెల్లూరు బ్యారేజీని త్వరగా పూర్తి చేసి ప్రారంభించడంపై దృష్టిపెట్టాలి.

అలాగే సొంత జిల్లాలో వున్న సంగం బ్యారేజీ పూర్తికి నడుంకట్టాలి. మెట్ట ప్రాంతమైన ఉదయగిరికి సాగునీరు, తాగునీళ్ళు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ పనులు మంజూరైవున్నాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయడంపై శ్రద్ధ చూపాల్సివుంది. అలాగే సోమశిల ఉత్తర కాలువ ఇంకా పూర్తి కావాల్సివుంది. తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి పనులపై కూడా దృష్టిపెట్టాలి. అన్నింటికంటే ముఖ్యమైనది నెల్లూరు, ప్రకాశం జిల్లాలలోని పడమర మండలాల ప్రజలు ఎన్నోఏళ్ళుగా ఎదురుచూస్తున్న వెలిగొండ రిజర్వాయర్‌ను పూర్తి చేయడం. దాదాపు 40, 50 మండలాలలకు సాగునీరు, తాగునీరు కొరత తీర్చే ఈ రిజర్వాయర్‌ను కూడా ప్రాధాన్యత ప్రాజెక్టులలో చేర్చాల్సివుంది.

జిల్లాకు వచ్చిన రెండో మంత్రి పదవి పరిశ్రమలు, ఐ.టి, వాణిజ్య పన్నుల శాఖ, ఈ శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఉదయగిరి వంటి మెట్టప్రాంతానికి చెందినవాడే! ఆయన శాఖ ద్వారా మెట్ట ప్రాంత అభివృద్ధికి అంతో ఇంతో మేలు చేయడానికి అవకాశముంది.

నెల్లూరుజిల్లాలో అన్ని విధాలా వెనుకబడిన ప్రాంతం ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలు, ఆత్మకూరు నియోజకవర్గంలోని 6 మండలాలు ఎప్పుడూ కరువు కాటకాలతో మునిగివుంటాయి. సీజన్‌వారీగా వ్యవసాయ పనులు తప్పితే మరోరకంగా ఉపాధి అవకాశాలుండవు. ముఖ్యంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలలో పారిశ్రామికాభివృద్ధి అన్నదే కనపడదు. 2004లో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి అంకురార్పణ జరిగింది. అయితే ఈ అభివృద్ధి అంతా కూడా సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు మాత్రమే పరిమితమైపోయింది. ఇటీవలకాలంలో కావలి నియోజకవర్గం కూడా పారిశ్రామికంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. కాని, ఉదయగిరి ప్రాంతాన్ని మాత్రం ఒక్క పరిశ్రమ కూడా పట్టించుకోవడం లేదు. ఏ ఒక్క పారిశ్రామికవేత్త ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టుమని వంద మందికి ఉద్యోగాలిచ్చే పరిశ్రమ ఒక్కటి కూడా ఇక్కడ లేదు. ఉదయగిరి ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన బీడుభూముల లభ్యత వుంది. భూ సేకరణకు సమస్య లేదు. ఉపాధి అవకాశాలు లేని కారణంగా ప్రతి ఏటా వేలాదిమంది ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతుంటారు. పరిశ్రమల శాఖ మంత్రిగా మేకపాటి గౌతమ్ ఈ ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి తన కొచ్చిన అవకాశంతో కృషి చేయాలి. పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ ప్రాంతాలలో ఒక పారిశ్రామికవాడను తీసుకురాగలిగితే ఇతరత్రా కూడా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశముంటుంది.



# కార్పొరేషన్ కసరత్తు

జిల్లాలో కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాల్టీల పాలకవర్గం పదవీకాలం ముగిసింది. నెల్లూరు నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీ కాలం కూడా త్వరలో ముగియబోతుంది. ఆగస్టులోపే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈసారి నెల్లూరు నగరపాలక సంస్థలో కార్పొరేటర్ల పదవులకు విపరీతమైన పోటీ నెలకొంటున్నట్లుగా తెలుస్తోంది. ముందుగా నెల్లూరు మేయర్ పదవి రిజర్వేషన్ ఖరారు కావాల్సివుంది. 2005లో మేయర్ పదవి ఓ.సి మహిళకు రిజర్వ్ కాగా, 2014లో బీసీలకు రిజర్వ్ అయ్యింది. మరి ఈ ఎన్నికలకు ఏ కేటగిరిలో వస్తుందో ఇంకా తేలలేదు. ఓసి అయితే ఫలానా నాయకుడు, బీసీ అయితే ఈ నాయకుడు మేయర్ అనే విశ్లేషణలు సాగుతున్నాయి.

ఇదొక ఎత్తయితే ఆయా డివిజన్ల కార్పొరేటర్ టిక్కెట్ల కోసం స్థానిక నాయకులు అప్పుడే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. అధికార వైసిపిలో ఈ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైసిపి టిక్కెట్ తెచ్చుకుంటే సులభంగా కార్పొరేటర్లం అయిపోతామనే ధీమాతో స్థానిక నాయకులున్నారు. వీళ్లంతా కూడా నిన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల కోసం పనిచేసిన వాళ్ళే! కార్పొరేటర్ అభ్యర్థులను తమ తమ పరిధిలలో జలవనరుల శాఖామంత్రి అనిల్ కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలే నిర్ణయించాల్సి వుంటుంది. ఒక్కో డివిజన్ నుండి ఇద్దరు ముగ్గురు కూడా టిక్కెట్ కావాలంటున్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ మొదలుకాగానే వీరిద్దరికీ ఈ టిక్కెట్ల వ్యవహారం పెద్ద పని కాగలదు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసమే ధ్యేయంగా...

# మారుతున్న కాలంతో పరుగులు పెడుతున్న డా. కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్




విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం.. వారి ప్రతిభను మరింతగా ప్రోత్సహించడంలో ముందుంటోంది నెల్లూరు, సరస్వతీనగర్‌లోని '**డా. కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్**'. తమ విద్యార్థులు ఎంతో కష్టమైన పోటీ పరీక్షల్లో సైతం అందరితో పోటీ పడి అగ్రస్థానంలో నిలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మారుతున్న కాలంతో పాటుగా పరుగులుపెడుతూ ఆధునిక విధానాలను కూడా అందిపుచ్చుకుని అత్యద్భుతమైన ఫలితాలు సాధిస్తోంది. విద్యార్థుల్లో విభిన్నమైన ఆలోచనలకు పదునుపెట్టి, వారు ఉన్నత శ్రేణిలో రాణించేందుకు తగ్గ మార్గాలను అన్వేషించి వారిలో సృజనాత్మక ప్రతిభను పెంపొందిస్తోంది. మంచి బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు, చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బందితో రేస్‌ను విద్యారంగంలో ఉన్నతస్థాయికి తీసుకు వెళ్తున్నారు డాక్టర్ కిషోర్ దంపతులు.



## యాక్టివిటీ టైమ్ జోన్

చిన్నారులకు ఆటల ద్వారా అటు మానసిక వికాసాన్ని, ఇటు శారీరక దృఢత్వాన్ని పెంపొందింపజేసేందుకు, వారిలో మరింత చురుకుదనం కల్గించేందుకు రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో యాక్టివిటీ టైమ్ జోన్ ఏర్పాటుచేయడం ఇక్కడి ప్రత్యేకత. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని పెట్టి, చిన్నారుల్లో పోటీతత్వాన్ని ఇనుమడింపజేసేందుకు పలురకాలైన గేమ్స్‌ను ప్రవేశపెట్టారు. నిపుణులైన వారిద్వారా విద్యార్థులకు వివిధ రకాలైన గేమ్స్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. షటిల్, ఆర్చరీ, క్రికెట్, చెస్, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, స్కేటింగ్, హార్స్‌రైడింగ్ ఇక్కడ ఉన్నాయి. వీటిలో విద్యార్థులు తమకు ఇష్టమైన ఏవైనా రెండు ఆటలను ఎంపికచేసుకోవచ్చు కూడా. స్కూల్ ముగిశాక ఈ గేమ్స్ ఉంటాయి. వీటిని ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు శరీరకదలికలతో వ్యాయామం, తద్వారా మంచి ఆరోగ్యం కూడా కలుగుతాయి. స్థిరమైన ఆలోచనల వృద్ధికి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఎంతగానో దోహదం చేస్తాయి. చిన్నతనంలోనే విద్యార్థులు వీటిలో పాల్గొనడం ద్వారా ఆయా క్రీడల్లో వారు మెళకువలు తెలుసుకునేందుకు, తమ ప్రతిభను మరింతగా పెంచుకునేందుకు ఎంతగానో వీలవుతుంది.



## అథ్లెటిక్స్ టైమ్

పాల్గొను, పోటీపడు, నిన్ను నీవు తీర్చిదిద్దుకో అనే నినాదంతో రన్నింగ్, జంపింగ్ మరియు త్రో వంటి క్రీడలలో విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తుండడం ఎంతో చెప్పుకోదగ్గ విషయం. ప్రతి ఏటా 6 సార్లు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంకు తీసుకువెళ్ళి పైక్రీడలలో తగు శిక్షణ ఇవ్వడం జరుగుతుంటుంది. తొలి మూడుసార్లలో కోచ్‌లచేత శిక్షణ, ఆ తర్వాత రెండుసార్లు ప్రాథమిక స్థాయి పోటీ, ఆ తర్వాత ఫైనల్స్ ఉంటాయి. ప్రత్యేకించి విద్యార్థులకు ఆసక్తిగా ఉండేందుకు రెడ్‌హౌస్, గ్రీన్ హౌస్, బ్లూహౌస్, మజెంతా హౌస్ అనే విభాగాలను ఏర్పాటు చేసి, ఆ నాలుగు విభాగాల్లో పోటీలు ఏర్పాటుచేసి గెలిచినవారికి చాంపియన్ ట్రోఫీ బహుకరణ ఉంటుంది. స్పోర్ట్స్ మీట్ అవార్డ్స్ డే రోజున విజేతలకు మెడల్స్, ట్రోఫీలు బహుకరిస్తారు. అయితే, ఇక్కడ గెలుపు అనేదే ప్రధానం కాదు. ఆయా స్పోర్ట్స్‌లో మనల్ని మనమే మెరుగుపరచుకోవాలనే అవగాహన కలిగితే, అదే విజయానికి దారి తీస్తుందనేది ఈ శిక్షణ లక్ష్యం. రన్నింగ్, లాంగ్‌జంప్, త్రోబాల్ వగైరాలు ఈ విభాగంలో ఉంటాయి.



శ్రీ కె.వి.రత్నం
శ్రీమతి పద్మావతి రత్నం

'రత్నం'.. అంటే రాష్ట్రంలోనే కాదు.. దేశ విద్యా రంగంలో కూడా తెలియని వారుండరు. 'రత్నం' అంటే ఒక సంస్థ కాదు..రత్నం అంటే ఒక బ్రాండ్. 1984లో దేశంలోనే తొలిసారిగా తన పేరునే సంస్థ పేరుగా పెట్టి 'రత్నం కోచింగ్ సెంటర్'ను ప్రారంభించాడు 'రత్నం' మాస్టారు. ఎన్నో విద్యా రత్నాలకు సానపెట్టి జాతిరత్నాలుగా తీర్చిదిద్దాడు..'రత్నం సారు'.

గత 35 సంవత్సరాలుగా ఎక్కడా తన ఇమేజ్ డామేజ్ కాకుండా తన 'బ్రాండ్'ను కంటికి రెప్పలా కాపాడుకొస్తున్నాడు. ఆయనలోని క్రమశిక్షణను, ఆయనలోని కష్టించే గుణాన్ని, ఆయన నేర్పిన మెళకువలను తూ.చ తప్పకుండా పాటిస్తూ తండ్రి రత్నం గారు, తల్లి పద్మావతమ్మ గారల మార్గదర్శకమే స్ఫూర్తిదాయకంగా చేసుకుని వారి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు వారి కుమారులు.

చదివింది వైద్యవిద్య, పుచ్చుకుంది డాక్టర్ పట్టా అయినప్పటికీ తండ్రి చూపిన బాటలోనే తాను నడవాలనే దృఢ సంకల్పంతో, శ్రీమతి వాసంతి తోడుగా, యువమేధావి 'రోషిణి' ఆధునిక ఆలోచనలే ఆశయాలుగా చేసుకుని తనదైన శైలితో నెల్లూరులోనే కాదు, రాష్ట్రంలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను తెచ్చుకునే ప్రయత్నంలో నిరంతరం శ్రమిస్తున్నాడు రత్నం మాస్టారి చిన్న కుమారుడు డాక్టర్ కిషోర్. బడి..అంటే పుస్తకాల మోత కాదని, బడి అంటే పాఠాల పాట కాదని, బడి అంటే శోధన పేరుతో చేసే సాధన కాదని రుజువు చేస్తున్నాడు. వినూత్న ఆలోచనలను 'రేస్ ఇంటర్నేషనల్'లో పరిచయం చేసి అంతర్జాతీయం అన్న పదానికి అర్థం చెప్తున్నాడు.



## ఆకర్షించి ఆలోచింపజేస్తున్న క్లబ్స్

పుస్తకపఠనంలో ఉన్న సంతృప్తిని, ఆనందాన్ని విద్యార్థులకు తెలిపేందుకు ఇక్కడ ఏర్పాటుచేసిన **బుక్‌సొసైటీ క్లబ్** విద్యార్థుల మనసులను బాగా ఆకట్టుకుంటోంది. వారిలో నూతన ఆలోచనలను ప్రోదిచేసే అత్యద్భుతమైన పుస్తకాలతో ఏర్పాటుచేసిన బుక్‌సొసైటీ అంటే చిన్నారులకెంతో ఇష్టం.

విద్యార్థులో ప్రతిభా పాటవాలను పెంచుతూ వారిలో నూతన ఆవిష్కరణలకు, వినూత్నమైన ఆలోచనలను కలిగించేందుకు నెలకొల్పిన ఈ బుక్‌సొసైటీతో పాటు, 4,5 తరగతుల విద్యార్థుల్లో ఆలోచనలను మాటలరూపంలో తెలియజేసుకునేందుకు తదనుగుణమైన అవగాహన కోసం **టెడ్-ఎడ్ క్లబ్** ఏర్పాటుచేశారు.

విద్యార్థుల భవితకు అవసరమయ్యే సృజనాత్మక శక్తిని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం వంటి విధానాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తూ **ఇంజనీరింగ్ క్లబ్, రోబోటిక్స్ క్లబ్**లను ఏర్పాటుచేశారు.

విద్యార్థుల్లో మంచి ఆలోచనలు రేకెత్తించి, వారిలో నైపుణ్యాన్ని మెరుగులు దిద్దేందుకు ఇంజనీరింగ్ క్లబ్ ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ క్లబ్ చిన్నారుల్లో ఎంతో ఆసక్తిని, ఆలోచనాశక్తిని పెంపొందింపజేస్తోంది కూడా.

అదేవిధంగా **కళాత్మక (స్కల్ప్చర్, ఆర్ట్, పెయింటింగ్) క్లబ్** ఏర్పాటుచేసి విద్యార్థుల్లో కళాత్మక దృష్టిని, మెరుగైన ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇవన్నీ చిన్నారులకు ఎంతో ఆహ్లాదం, ఆనందంతో పాటు వినోదాన్ని విజ్ఞానాన్ని కలిగిస్తున్నాయి.



## హాంగ్‌కాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో రేస్ డైరెక్టర్స్ మరియు అకడమిక్ హెడ్స్ :

డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్స్ డైరెక్టర్స్ మరియు అకడమిక్ హెడ్స్ కృష్ణకిశోర్, వాసంతిలు 2019 మార్చిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అంతర్జాతీయ విద్యా ప్రమాణాల గురించి పూర్తిస్థాయిలో అక్కడి నిపుణులతో చర్చించడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థులను సమున్నతమైన రీతిలో తీర్చిదిద్దేందుకు అనువైన విధానాలను గురించి పూర్తిస్థాయిలో చర్చించారు.

ఎంతో విశిష్టమైన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్స్(1 నుండి 5వ తరగతి వరకు)ను రూపొందించుకుని ఈ విద్యాసంవత్సరం నుంచే రేస్ స్కూల్లోనూ ఈ వినూత్న విధానాలను అమలుచేస్తూ విద్యార్థులను అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. 1 నుంచి 5 తరగతుల దాకా అన్ని స్థాయిల విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో అత్యున్నత ప్రమాణాలను ఆచరణలోకి తెస్తూ నెల్లూరులోని రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ అందరికీ మార్గదర్శకమవుతోంది.




డాక్టర్ కె.కృష్ణకిషోర్
శ్రీమతి వాసంతి

## క్రియేటివిటీ యాక్టివిటీ – సర్వీస్





సృజనాత్మకత కలిగివుండడం, శారీరక ఉల్లాసాన్ని పెంపొందింపచేసుకోవడం, సేవాభావంతో సమాజానికి సముచిత సేవలు అందించడం వంటి లక్షణాలను నేటి తరంలో క్రియేటివిటి, యాక్టివిటి, సర్వీస్ అనే కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించి విజ్ఞాన వికాసంతో పరిపూర్ణమైన పౌరులుగా విద్యార్థులు తయారయ్యేందుకు డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ చేస్తున్న కృషి అమోఘం. ఆయా విభాగాల్లో విద్యార్థులకు మంచి ఆసక్తిని పెంపొందింపజేసే విధానాలు అవలంభించడం రేస్ ప్రత్యేకత.



'క్రియేటివ్' విభాగంలో ఒక మంచి **డ్రామా క్లబ్**ను ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో విద్యార్థులు పాల్గొని మంచి వక్తలుగా, మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దబడతారు. ఈ కార్యక్రమంలో భాగంగా సరస్వతినగర్‌లోని 'రేస్ ఇంటర్నేషనల్'లో 1 నుండి 5వరకు చదివే విద్యార్థినీవిద్యార్థులచే ప్రతియేటా వివిధ విభాగాలకు చెందిన 7 రకాల డ్రామా(నాటిక)లను అత్యద్భుతంగా రూపొందించి పిల్లలకు సక్రమమైన శిక్షణను ఇచ్చి సదరు నాటికలను కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రదర్శింపజేసి విశేష ప్రశంసలను రేస్ ఇంటర్నేషనల్ అందుకోవడం గమనార్హం.


అదేవిధంగా **యాక్టివిటీ టైమ్‌జోన్** మరియు **అథ్లెటిక్స్ టైమ్‌జోన్**లో చెప్పిన విధంగా ఆటలు మరియు క్రీడల ద్వారా శారీరక ఉల్లాసంతో పాటు మానసిక వికాసాన్ని పరిపూర్ణంగా అందించడానికి నిత్యం కృషి చేస్తూనే వుంటారు 'రేస్' ఇంటర్నేషనల్ సిబ్బంది.



మరో ముఖ్యమైన అంశం..**సర్వీస్(సేవ)**. విద్యార్థి దశ నుండే సేవాభావం అలవడితే సమాజానికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది కనుక, రేస్ చిన్నారులు సమాజసేవలో కూడా ముందుండాలనే ధ్యేయంతో, మానవీయ విలువలను విద్యార్థులకు బోధించేవిధంగా ఈ విభాగం ఏర్పాటు చేశారు.

సమాజసేవాభిలాషతో.. ఇతరులకు సాయం చేసే గుణాన్ని, మానవత్వాన్ని పెంపొందించే సుగుణాన్ని అలవరచేందుకు డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేస్తున్న సేవ ఎంతైనా విశేషమైనది. అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణే ధ్యేయం అనే అంశం కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతియేటా సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో మొక్కలు నాటింపజేసి పర్యావరణం పట్ల పిల్లలకు చైతన్యాన్ని కలిగించడంలో కూడా ముందంజలో వుంది 'రేస్ ఇంటర్నేషనల్'.

బడిగా, గుడిగానే కాక, తల్లిఒడిగా కూడా ఎంతో ఆత్మీయతతో విద్యాబోధన సాగే రేస్ స్కూల్‌లో చిన్నారులు ఎంతో స్వేచ్ఛగా తమ ఆలోచనలను అందరితోనూ పంచుకుంటూ, ఉపాధ్యాయుల సహకారంతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు. అదేవిధంగా, ఇక్కడి ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల మనసులను గ్రహించి, వారి అభిప్రాయాలను గుర్తించి, వారికి ఎలాంటి విధానాలు ఇష్టమో తెలుసుకుని బోధన చేస్తుండడంతో చిన్నారులు రేస్‌ను ఎంతగానో ఇష్టపడుతున్నారు. మంచి క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, అత్యంత ఆధునిక విద్యావసతులతో కూడిన డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ తన స్థాయికి తగ్గట్టుగా అంతర్జాతీయస్థాయి ఖ్యాతిని ఆర్జిస్తూ ముందుకు పరుగులు పెడుతోంది. అందుకు పాఠశాల డైరెక్టర్లు డా. కృష్ణకిశోర్, వాసంతి గార్ల నిబద్ధత, అకుంఠిత దీక్షతో పాటు ఆధునిక ప్రపంచంలో శరవేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను అధ్యయనం చేస్తూ అంతర్జాతీయ ప్రమాణాలను తమ రేస్ ఇంటర్నేషనల్‌లో పరిచయం చేయడంలో వారి కుమార్తె కుమారి రోషిణి అవలంభిస్తున్న విధానాలే ప్రధాన కారణం. సమాజంలో 'రేస్' చిన్నారులు ఎక్కడా వెనకబడకుండా అత్యుత్తమస్థాయిలో ఉన్నత శిఖరాలందుకోవాలనే ఆకాంక్షతో, చిన్నారుల బంగారుభవిత పట్ల ఎంతో బాధ్యతతో.. వారు ఈ పాఠశాలను అత్యద్భుతంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. అందుకే ఇక్కడి చిన్నారులు చక్కని విద్యావంతులుగా, వక్తలుగా, ప్రతిభామూర్తులుగానే కాక, సమాజం పట్ల బాధ్యతను గుర్తించి, మంచి సమాజసేవకులుగా కూడా ఎదిగేందుకు రేస్ చేస్తున్న కృషి... రత్నం విద్యాసంస్థలకే కాదు... నెల్లూరీయులందరికీ గర్వకారణం.



నూతన ఒరవడితో నేటితరం విద్యార్థినీ విద్యార్థులను నవతరం సారథులుగా తీర్చిదిద్దుతున్న 'రేస్ ఇంటర్నేషనల్' యాజమాన్యానికి 'లాయర్' అభినందనలు.

జిల్లాలో..

# ప్రతిపక్షం ఉనికెక్కడ?






ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వాలు మారుతుంటాయి... అధికార పక్షం విపక్షమవుతుంది... విపక్షం అధికారపక్షం అవుతుంటుంది. ప్రతి ప్రభుత్వంలోనూ అధికారపక్షాన్ని సై అంటే సై అనేటట్లుగా పలువురు విపక్ష నాయకులు కూడా బలంగా వుండేవాళ్ళు. అసెంబ్లీలోనే కాక జడ్పీ, ఐఎబి, డిఆర్‌సి, కార్పొరేషన్ కౌన్సిల్ వంటి సమావేశాలలో కూడా ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు సభ్యులుగా పాల్గొని ప్రజల పక్షాన తమ వాదనలు వినిపిస్తుండేవాళ్ళు. ప్రతి ప్రభుత్వంలోనూ ప్రతిపక్షాల వాయిస్ బలంగానే వినిపిస్తుంది. జిల్లాలో 2014 నుండి 2019 దాకా అధికారపక్షాని కంటే ప్రతిపక్ష సభ్యుల వాయిస్సే ఎక్కువుగా వినిపించింది. 2014 ఎన్నికల్లో ఇద్దరు ఎంపీలు, ఏడుమంది ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో గెలిచారు. కాని, ఇప్పుడు చూస్తే జిల్లాలో ప్రతిపక్ష తెలుగుదేశంకు ఒక్క ఎంపి గాని, ఒక ఎమ్మెల్యేగాని లేదు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఒక్కడే ఎమ్మెల్సీగా ఉన్నాడు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలు ఎమ్మెల్సీలుగా వున్నప్పటికీ, ఆ పదవులకు రాజీనామాలు చేసాకే చంద్రబాబు వారికి అసెంబ్లీ టిక్కెట్లు ఇవ్వడం తెలిసిందే! ఇప్పుడు ప్రతిపక్ష టిడిపి తరఫున జిల్లా స్థాయి సమావేశాలలో బీద రవిచంద్ర ఒక్కడే పోగలడు. ఆయన గొంతు మాత్రమే ప్రతిపక్షం వైపు నుండి వినపడగలదు. భవిష్యత్‌లో తెలుగుదేశంకు వున్న ఎమ్మెల్యేల సంఖ్య దృష్ట్యా ఎమ్మెల్సీలను పంపించడం కూడా కష్టమే! కాబట్టి జిల్లా తెలుగుదేశం నాయకులు మధ్యలో ఎమ్మెల్సీ పదవులు వస్తాయనే ఆశ కూడా పెట్టుకోనవసరం లేదు. ఇక ఈ ఐదేళ్ళు ప్రతిపక్షం గొంతు పెద్దగా వినిపించే అవకాశమే లేదు.



అడుగంటిన భూగర్భజలాలు
వానల్లేక ఎండిపోయిన చెరువులు
దాహార్తితో అల్లాడుతున్న గ్రామాలు

# నీటి కోసం.. కోటిపాట్లు

**జిల్లాలో ఇటీవలి కాలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాల నీటి మట్టం అడుగంటిపోయింది. చెరువులు దొరువులు, బోర్లు, బావులు అన్నీ ఎండిపోయాయి. దీంతో అనేక గ్రామాలు తాగేందుకు గుక్కెడు నీళ్ళు కూడా దొరక్క అలమ టిస్తున్నాయి. గతంలో పాడిపంటలతో కళకళలాడిన జిల్లా..ఇప్పుడు దాహార్తితో గొంతెండిపోతోంది. ఈ దుర్భిక్షం ఇలాగే కొనసాగితే ముఖ్యంగా మెట్ట ప్రాంతంలోని గ్రామాల ప్రజల జీవన పరిస్థితులు మరింత దయనీయంగా మారనున్నాయి.**

ఒకవైపు ఎండలు నిలువునా మండిపోతున్నాయి. వాన చుక్కలు రాలడం లేదు. జిల్లాలోని అనేక గ్రామాల్లో తీవ్రమైన నీటిఎద్దడి అలముకుంది. మెట్ట ప్రాంతాల్లోని అనేక గ్రామాలు నీళ్ళు లేక అల్లాడిపోతున్నాయి. ఎక్కడా చెరువుల్లో నీటి చుక్క కనిపించడం లేదు. కాలువలన్నీ ఎప్పుడో ఎండిపోయాయి. బోర్లలో నీళ్లు రావడం లేదు. బావుల్లో బురద తప్ప నీళ్ళు లేవు. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి. ఎక్కడైనా పొలాల్లో సేద్యపు బావులో, బోర్లో ఉంటే, వాటిని వెతుక్కుంటూ వెళ్ళి నీళ్ళు తెచ్చుకునే గ్రామస్తులు, ఇప్పుడు ఎక్కడా నీటి జాడ కానరాకపోవడంతో తాగేందుకు మంచినీటి కోసం కటకటలాడిపోతున్నారు. జిల్లా అధికారయంత్రాంగం నీటిఎద్దడితో బాధపడుతున్న గ్రామాలను గుర్తించి అనేక గ్రామాల్లో మంచినీటి ట్యాంకులతో నీరు పంపిణీ చేస్తున్నప్పటికీ అవి చాలడంలేదు. ఆ నీటి కోసం ఖాళీ బిందెలు చేతపట్టుకుని ఆయా గ్రామాల్లో ప్రజలు నిత్యం పడిగాపులు కాస్తున్నారు. ఎక్కడైనా కుళాయిల వద్ద నీళ్ళు వస్తున్నాయని తెలిస్తే చాలు.. ప్రజలు ఆ నీటికోసం పరుగులు తీస్తున్నారు. దాహార్తిని తీర్చుకోవడం కోసం, ఇతర అవసరాల కోసం గుక్కెడు నీటికోసం జనం కోటిపాట్లు పడుతున్నారు. జిల్లాలోని ప్రధాన నీటివనరులైన సోమశిల, కండలేరు జలాశయాల్లో కూడా నీటిమట్టం అడుగంటిపోయింది. ఇప్పుడు కొద్దోగొప్పో నీరు వదులుతున్నారు కానీ ఆ నీళ్ళు ఏ మూలకీ చాలడం లేదు. ఇంకొద్ది రోజులు పోతే అవికూడా వస్తాయో లేదో తెలియని పరిస్థితి. అనేక ప్రాంతాల్లోని నీటివనరులు ఎండిపోవడంతో చాలాచోట్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నీళ్లట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. పెన్నా పక్కనే ఉన్నా చుట్టుపక్కల గ్రామాల్లో నీళు లేకపోవడంతో ప్రజలు నీటికరువుతో విలవిలల్లాడుతున్నారు. ఇంకొద్దిరోజులు ఇలాగే ఉంటే ప్రజల బాధ ఇక ఆ దేవుడికే ఎరుక!.....

## గూడూరు డివిజన్ వార్తలు

### డాక్టర్ సిఆర్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



డాక్టర్ సిఆర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిఆర్‌రెడ్డిని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఈనెల10వ తేది రాత్రి ఆయన నివాసానికి వెళ్ళి గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడం అభినందనీయమని డాక్టర్ సిఆర్‌రెడ్డిని ప్రశంసించారు. అంతేకాక, కళాశాల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేయడం, ఆధ్యాత్మికరంగంలోనూ సేవలందిస్తూ ఎన్నో ఆలయాల అభివృద్ధికి కృషిచేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా పట్టణాభివృద్ధికి కూడా సహకరించాలని ఆయన్ను కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణితో పాటు వైఎస్సార్సీపి నాయకులు పాల్గొన్నారు.



సమాజానికి ఎన్నో సేవలు చేస్తున్న గూడూరు ఆంధ్ర మహిళా మండలి సంస్థ సొంత భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఇటీవల గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావును కలిసిన మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మరియు సభ్యులు.

### సమిష్టిగా పనిచేయాలి

**- జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు**



కలెక్టర్ గిరిబాబును సత్కరిస్తున్న అరవ పార్వతయ్య

అధికారులంతా కలసి సమిష్టిగా పని చేయడం ద్వారా ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలను చేరువచేయాలని జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు అన్నారు. ఈ నెల 8న చిల్లకూరు మండలంలోని ఉపాధి హామీ పనులను తనిఖీ చేసేందుకు వచ్చిన సందర్భంగా, తొలుత గూడూరుకు వచ్చి సబ్‌కలెక్టర్ ఆనంద్‌తో పాటు రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. కొత్తకలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషగిరిబాబును ఇక్కడి రెవెన్యూ ఉద్యోగులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అందరం కలసి సమిష్టిగా పనిచేసి రెవెన్యూకు మంచి పేరు తీసుకువద్దామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధారాణి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

గూడూరు డివిజన్ పరిధిలోని గ్రామాల్లో కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియను అధికారులు వేగవంతంగా పూర్తిచేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ ఆనంద్ అన్నారు. గూడూరులోని తన ఛేంబర్‌లో మంగళవారం డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. కౌలు రైతులకు ఎస్ఈసి కార్డులు పంపిణీచేయడంపై సమీక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే

### విద్యార్థులను ప్రోత్సహించాలి

**- మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన**



టెన్త్‌లో రాణించిన విద్యార్థులతో దేవసేన, రాజేంద్రప్రసాద్ తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మంచి ప్రోత్సాహకాలు అందించాలని, తద్వారా ఈ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని గూడూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన అన్నారు. గూడూరు పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో జేవివి ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తమ విద్యార్థులకు అభినందన సభ జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులను ఆమె ఈ సందర్భంగా అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోతోందని, అయితే ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు విద్యలో అందరికంటే మెరుగ్గా రాణిస్తున్నారన్నారు. అలాంటివారిని ప్రోత్సహిస్తే విద్యార్థిలోకానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఈ ఉద్దేశ్యంతో గత నాలుగేళ్ళుగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిఎస్ఆర్ ట్రస్ట్ తరఫున వారికి విలువైన బహుమతులు కూడా ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు చేతిగడియారాలను, జ్ఞాపికలను బహుకరించారు. ఎంపిడిఓ అన్నపూర్ణారావు, కౌన్సిలర్లు రమేష్, కల్పన, షంషేర్, జేవివి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పురుషోత్తం, రామ్మోహన్‌రావు, అశోక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గల్పిక

# వివేకా ఐడియాకు సోనియా ఫిదా!

ఢిల్లీలోని టెన్‌జనపథ్... కాంగ్రెస్ రాజమాత సోనియాగాంధీతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు దిగ్విజయ్‌సింగ్, గులాంనబీ ఆజాద్, వీరప్ప మొయిలీ, చిదంబరం, కపిల్ సిబల్, మనీష్‌తివారి, అహ్మద్ పటేల్, అంబికాసోని, ఆనంద శర్మ, సచిన్‌పైలట్ వంటి నాయకులున్నారు. అప్పుడే వి. హెచ్.హనుమంతరావు వంటింట్లో నుండి వచ్చి అందరికీ కాఫీలు అందించాడు. అందరూ కప్పులు తీసుకున్నాక ఆయన సోనియాతో వుండి... మేడమ్ లంచ్‌కు వెజ్ రెడీ చేయమంటారా, నాన్‌వెజ్ చేయమంటారా? అని అడిగాడు. సోనియా చిరాకుగా ఎలుకల ఫ్రై చెయ్ అని అంది. విహెచ్ సీరియస్‌గా... అందరికీ రెడీ చేయించమంటారా అని అడిగాడు. అప్పుడు దిగ్విజయ్‌సింగ్ వుండి... విహెచ్... అమ్మ చెప్పింది చెయ్... అమ్మ వేసేదే ఆసనం.. చేసిందే శాసనం అని సినిమా డైలాగ్ వదిలాడు. అయితే అందరికీ ఎలుకల ఫ్రైయ్యే వండుతా అంటూ విహెచ్ లోపలకు వెళ్లిపోయాడు. తర్వాత అహ్మద్ పటేల్ సోనియాతో... మేడమ్ మీరెందుకు ఇంత చిరాకుగా వున్నారు, మమ్మల్ని ఇంత అర్జంట్‌గా ఎందుకు పిలిపించారో అర్థం చేసుకోగలం. ఈ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైనందుకు మాకూ మీకంటే బాధగానే వుంది, కనీసం, ఈ ఎన్నికల్లోనన్నా రాహుల్‌ను ప్రధానిగా చూడాలనుకున్నాం, మా కలలు నెరవేరకుండాపోయాయని బాధపడసాగాడు. సోనియా వుండి... పార్టీ ఓడిపోయినందుకు కాదు నా బాధ... రాహుల్ ఇలా ఎందుకు చేస్తున్నాడన్నదే నా బాధంతా అని చెప్పింది. ఇంతకీ ఏం చేశాడు మేడమ్ అని గులాంనబీ ఆజాద్ అడిగాడు. ఏం చేశాడో మీరే చూడండి అంటూ ఒక సిడి తీసి సీడీ ప్లేయర్‌లో పెట్టి టీవీ ఆన్ చేసింది. స్క్రీన్ మీద సీన్‌లు..

ఆరోజు మే23వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట... రాహుల్‌గాంధీ తన బెడ్‌రూంలో కూర్చుని న్యూస్ ఛానెల్స్‌ను చూస్తున్నాడు. అప్పుడే స్క్రీన్‌పై ఎన్నికల ఫలితాలలో 350సీట్లలో ఎన్డీఏ ఆధిక్యత... 100 సీట్లలో యూపిఏ ఆధిక్యం అని బ్రేకింగ్ న్యూస్ రాసాగాయి. దానిని చూడగానే రాహుల్ ఆనందంతో గెంతులు వేయసాగాడు. పవన్‌కళ్యాణ్‌లా డ్యాన్స్ చేయసాగాడు. అతనితో పాటు కూర్చుని ఫలితాలను చూస్తున్న జ్యోతిరాదిత్య సింధియా రాహుల్ చేస్తున్న చేష్టలకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. అతను రాహుల్‌ను భుజం పట్టుకుని ఆపి... సార్, మీరు పొరపడుతున్నారు. 350సీట్లలో ఆధిక్యంతో ఉండేది యూపిఏ అనుకుంటున్నట్లున్నారు, అది యూపిఏ కాదు ఎన్డీఏ... మనం వంద సీట్లలోనే లీడ్లో వున్నాం అని చెప్పాడు. దానికి రాహుల్... నేను హార్వర్డ్ యూనివర్శిటీలో చదివాను, నాకు ఆ మాత్రం తెలియదనుకున్నావా... నేను ఆనందంతో చిందులేసేది కూడా ఎన్డీఏ ఆధిక్యంలో వున్నందుకే అని చెప్పాడు. ఆ మాటతో జ్యోతిరాదిత్య తల వెయ్యినూట పదహారు కిలోమీటర్ల వేగంతో తిరగసాగింది. ఓ పదినిముషాలకు ఆయన తేరుకుని... మన పార్టీ ఓడిపోతుంటే మీరు ఆనందంతో చిందులేయడమేంటి సార్... నాకేం అర్థం కావడంలేదని అడిగాడు. అందుకు రాహుల్... చూడు జ్యోతిరాదిత్య... ఇప్పుడు మన పార్టీ గెలిచిందనుకో... నన్ను ప్రధాని సీట్లో కూర్చోబెడతారు. నాకు కట్టేసినట్లవుతుంది. స్వేచ్ఛగా బ్రతకలేను. అదే పార్టీ ఓడిపోయిందనుకో ఏ పీడా లేదు. ఏ దేశానికైనా వెళ్లొచ్చు... ఇష్టం వచ్చినట్లు తిరగొచ్చు...ఏదో మా మమ్మీ నన్ను ప్రధానిగా చూడాలనే బలవంతం మీద ఈ రాజకీయాలలో తిరుగుతున్నాను. లేకుంటే హ్యాపీగా ఆ దేశం ఈ దేశం తిరుక్కుంటూ జల్సాగా గడుపుతుంటాను. ఎలాగో ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవబట్టి నా నెత్తిన పాలు పోసినట్లయ్యింది అని... నేను ఈ సాకు పెట్టి ఏఐసిసి అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తాను, ఆ తలనొప్పి కూడా వదిలిపోద్ది అని తెలివిగా చెప్పాడు.

★★★★★

ఇక్కడితో సి.డిలో సీన్‌లు అయిపోయాయి. ఆ సీన్‌లు చూసిన కాంగ్రెస్ నాయకులందరూ కూడా రాహుల్ వైఖరికి ఆశ్చర్యకరంగా ముఖాలు పెట్టారు. అప్పుడు సోనియా వుండి... ఇప్పుడు చెప్పండి... రాహుల్ వ్యవహారం చూస్తే పార్టీని గెలిపించి ప్రధాని కావాలనే ఉద్దేశ్యంలో లేడు. నాకేమో జీవితంలో రాహుల్‌ను ప్రధానిగా చూడాలనేది కోరిక.. వీటిని ఎలా సాధించుకోవాలి అని అడిగింది. అంబికాసోని వుండి... మేడమ్, ముందు ఆయన ఏఐసిసి పదవికి రాజీనామా చేస్తానన్నాడు కదా... ఆయన రాజీనామాను మేమంతా తిరస్కరిస్తాం... పార్టీ ఓటమికి మాదే బాధ్యత అని చెప్పుకుంటాం అని చెప్పింది. మల్లిఖార్జున ఖర్గే వుండి.. అబ్బాయి జాతకంలో ఏదో దోషమున్నట్లుందమ్మా... ముందు ఏదో ఒక అడ్డగాడిదను చూసి పెళ్లి చేస్తే దారిలో పడతాడనిపిస్తుందని అన్నాడు. అప్పుడే కిచెన్‌లో నుండి బయటకొచ్చిన విహెచ్ హనుమంతురావు ఆ మాటలు విన్నాడు. వెంటనే బయటకు పరుగెత్తాడు. ఈలోపు ఇక్కడ మనీష్‌తివారి వుండి... రాహుల్ పేరుతో నవగ్రహ శాంతి హోమం చేయిస్తే ఫలితమేమన్నా వుంటుందేమో అని చెప్పాడు. అంతలో అక్కడ "ఊ ఊ ఊవ్' అనే శబ్దాలు వినిపించాయి. అవేంటివా అని అందరూ హాల్ బయటకొచ్చారు. అక్కడచూస్తే విహెచ్ హనుమంతురావు ఒక గాడిదను తెచ్చి వున్నాడు. హనుమాన్‌జీ ఏమిటిది అని సోనియా అడిగింది. ఏదో ఒక అడ్డగాడిదను చూసి రాహుల్‌బాబుకు పెళ్లి చేయాలని ఇంతకుముందే మాట్లాడుకుంటున్నారు కదా మేడమ్... రాహుల్ పెళ్లి కోసం నావంతు ప్రయత్నం చేశాను అని చెప్పాడు. అతని సమాధానానికి సోనియా తల బాదుకొని... వంటింట్లో ఆలూ కుర్మా మాడిపోయిన వాసనొస్తుంది... ముందు ఆ సంగతి చూడుపో అంది... తర్వాత అందరూ హాల్‌లోకి వచ్చారు. సోనియా కన్నీళ్లతో... రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్న నా కోరిక తీరే మార్గం లేదా... ఈ జీవితానికి నా ఆశ అడియాశ కావాల్సిందేనా? అని బిగ్గరగా అరచింది. అప్పుడు హాల్‌లో.. మీ కోరిక తీరుతుంది అనే మాట వినిపించింది. ఆ మాట అన్నది ఎవరా అని అందరూ వెనక్కి చూశారు. అక్కడ నల్ల కళ్లద్దాలు, నల్ల టీషర్ట్, నల్ల జీన్స్, నల్ల బూట్లతో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి ఫ్లాష్‌లో మెరుస్తున్నాడు. వివేకాను చూసి అందరూ బిత్తరపోయారు. సోనియా ధైర్యం తెచ్చుకుని... వివేకాజీ... మీరు స్వర్గానికెళ్లారు కదా, ఇక్కడకు ఎలా రాగలిగారు అని అడిగింది. అప్పుడు వివేకా... ఎంతైనా మీరు మా నాయకురాలు... మీ నాయకత్వంలోనే మూడుసార్లు ఎమ్మెల్యేనయ్యాను. మీరు కన్నీళ్లు పెట్టుకోవడం పైనుండి చూసి చలించిపోయాను. స్వర్గాధిపతి వద్ద స్పెషల్ పర్మిషన్ తీసుకుని వచ్చాను అని చెప్పాడు. సోనియా వుండి... రాహుల్‌ను ప్రధానిగా చూడొచ్చు అనే నా ఆశ ఎలా నెరవేరుతుందో చెప్పు... మా ఈ పప్పును నమ్ముకుంటే ఎన్నికల్లో గెలుస్తాం, అధికారంలోకి వస్తాం అనే నమ్మకం లేకుండా పోయిందని అంది. అప్పుడు వివేకా... సినిమాలు ఎక్కువుగా చూస్తుంటే... ఐడియాలు ఎక్కువుగా వస్తుంటాయ్. నేను అందుకే సినిమాలు ఎక్కువుగా చూసేవాడిని... 'ఒకే ఒక్కడు' సినిమాలో ఒక రోజు సీఎం కాన్సెప్ట్ వుంటుంది. అలాగే ఈమధ్య పత్రికలో చూశాను... క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలుడిని ఒకరోజు పోలీసు కమిషనర్‌ని చేశారు. అట్లాగే మీ ఆశ తీర్చడం కోసం ఒకరోజు రాహుల్‌ని ప్రధానిగా వుంచమని నరేంద్ర మోడీని కోరుదాం... మానవతా దృక్పథంతో ఆయన ఖచ్చితంగా ఒప్పుకుంటారు. ఒకరోజు కాబట్టి రాహుల్‌కూ పెద్ద తలనొప్పి వుండదు. ఇవ్వడానికి మోడీకి కూడా అభ్యంతరం వుండదు... ఇలా మీ జీవిత ఆశ కూడా తీరుతుంది... ఇక కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవడం, అధికారంలోకి రావడం అన్నది దగ్గర దగ్గరలో లేదుకాబట్టి రాహుల్‌ను ప్రధానిగా చూడడానికి ఇంతకంటే మార్గం లేదని చెప్పాడు. వివేకా ఐడియాకు సోనియా ఫిదా అయ్యి రెండుచేతులెత్తి... నీలాంటి ఆణిముత్యం లేకపోవడం మాకు పెద్ద లోటంటూ నమస్కరించింది.

## మద్యం మహమ్మారిపై...

# 'బెల్టు' తీసిన ప్రభుత్వం

- అక్కచెల్లెమ్మలకిచ్చిన వాగ్దానం నెరవేరబోతోంది
- ఇక రాష్ట్రంలో...దశల వారీగా మద్యనిషేధం
- జీవితాలను నాశనం చేస్తున్న 'బెల్టు'షాపుల ఆటకట్టు!
- సిఎం జగన్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు



నిరుపేదల జీవితాలను బుగ్గి చేస్తున్న మద్యం మహమ్మారికి రోజులు దగ్గరపడ్డాయి. సంపాదించిన డబ్బునంతా తాగుడుకు తగలబెడుతూ కాపురాలను నిలువునా కూల్చేసుకుని అధోగతి పాలవుతున్న సాదా సీదా, నిరుపేద, మధ్యతరగతి ప్రజల దీనస్థితి ఇక మారనుంది. మద్యం మహమ్మారి బారిన పడి సంసారాలు చితికిపోతున్న తరుణంలో బాధిత మహిళల ఆవేదన, ఆక్రందన చూసి.. 'నేను విన్నాను..నేను ఉన్నాను' అంటూ జగన్ వారిని ఊరడించారు. వారి కన్నీళ్ళు తుడిచారు. తాను ముఖ్యమంత్రి కాగానే మద్యాన్ని నిషేధించి ఒక అన్నగా మీ కాపురాలు నిలబెడతానంటూ జగన్ తన పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసేందుకు జగన్ సంసిద్ధులయ్యారు. మహిళాలోకానికంతటికీ ఇది శుభవార్త. జగన్ ముఖ్యమంత్రి కాగానే మద్యనిషేధానికి కంకణ బద్ధులవుతుండడం రాష్ట్రప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో హుటాహుటిన ఎక్సైజ్‌శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా బెల్టుషాపులను నిర్మూలించడానికి చకచకా బృందాలను సిద్ధం చేసింది. రాష్ట్రానికి ఇది నిజంగా నవోదయమే అని చెప్పవచ్చు.


రాష్ట్రంలో మద్యం మహమ్మారి ఆగడాలకు అంతే లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ప్రభావం అంతా ఇంతా కాదు. ఈ మాయదారి మద్యం వల్ల అనేకమంది కాపురాల్లో నిత్యం కొట్లాటలే.. రోజూ వేదనలు.. రోదనలే. ఇంటి యజమానులు మద్యానికి బానిసలు అవుతుండడంతో ఎంతో మంది సంసారాలు నాశనం అవుతున్నాయి. అందుకు తోడు మద్యం బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో నిత్యం ఎంతోమంది పేదలు, మధ్యతరగతి ప్రజలు మద్యానికి బానిసలై ఇళ్ళు ఒళ్ళు గుల్ల చేసుకుంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వహయాంలో పేదల బతుకులను పట్టించుకునే నాథులే కరువయ్యారు. అంతేకాదు మద్యం ఒక వ్యాపారంగా వర్థిల్లింది. జనం నుంచి డబ్బు గుంజుకుని ప్రభుత్వానికి ఆదాయం రాబట్టుకునేందుకు ప్రభుత్వమే లక్ష్యాలను నిర్ణయించి మద్యం అమ్మకాలను ఇష్టానుసారంగా సాగించడంతో మద్యం దుకాణాలు మరింతగా విస్తరించాయి. ధనార్జనే ధ్యేయంగా జీవించే మద్యం వ్యాపారులు ఇదే అదనుగా పుట్టగొడుగుల్లా విస్తరించి సందుగొందుల్లో సైతం మద్యం బెల్టు దుకాణాలు పెట్టి జనం జీవితాలను నాశనం చేయడం ప్రారంభించారు. ఎక్కడ చూసినా ఈ దుకాణాలే కనిపిస్తాయి. అందులోనూ రాష్ట్రంలో అనేక బెల్టు దుకాణాలు టిడిపి నాయకులకు చెందినవి కావడం గమనార్హం. అందుకే గత ప్రభుత్వం వీటి రద్దు విషయం పట్టించుకోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో మద్యం మహమ్మారి గొంతులో వెలక్కాయ పడింది. నిరుపేదల జీవితాల్లో కొత్తవెలుగులు కనపించే దశ ప్రారంభమైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా.. దశల వారీగా మద్యనిషేధం అమలు కానుంది.

### జిల్లాలో రోజూ కోట్లాదిరూపాయల మద్యం తాగేస్తున్నారు...

ఒకప్పుడు మద్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఈ జిల్లాలో కూడా మద్యం మహమ్మారి కోరలు సాచింది. గత ప్రభుత్వ అండదండలతో జిల్లాలో మద్యం బెల్టుషాపులకు కొదవే లేకుండా పోయింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా బడులు, గుడులు కనిపించకున్నా మద్యం దుకాణాలు మాత్రం బోలెడన్ని కనిపిస్తుంటాయి. నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాల పరిధిలోమొత్తం 350 మద్యం దుకాణాలు మరో 48 బార్లు కూడా ఉన్నట్లు సమాచారం. రోజుకు దాదాపు నాలుగు కోట్ల రూపాయల దాకా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని అంచనా! దీనినిబట్టి జిల్లాలో తాగుడు ఎంత బాగా విస్తరించిపోయిందో చెప్పనే అక్కరలేదు. అంతేకాదు, ఈ మద్యం దుకాణాలకు అనుబంధంగా కనీసం మూడువేలకు పైగానే బెల్టు దుకాణాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. మద్యం దుకాణాల్లో కంటే ఈ మద్యం బెల్టుషాపుల్లోనే రోజూ అత్యధికంగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి కూడా. ప్రతిరోజూ.. 24 గంటలూ ఈ మద్యం దుకాణాల్లో మద్యం అందుబాటులో ఉండడంతో మందుబాబులు ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం తెచ్చుకుని సేవిస్తూ..ఆ మత్తులో జోగుతున్నారు. అనేకమంది మృత్యువుకు చేరువకావడం కూడా జరుగుతోంది. మరోవైపు కాపురాలు కూడా గుల్లవుతున్నాయి. ఎట్టకేలకు ఈ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

# కళ్యాణ వైభవం...!

## ప్రతాప్‌రెడ్డి - మాళవిక



ఉదయగిరి మాజీశాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి - అనసూయమ్మల కుమారుడు **ప్రతాప్‌రెడ్డి - మాళవిక** (నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వాస్తవ్యులు రామిరెడ్డి సుధాకర్‌రెడ్డి - రాజేశ్వరమ్మల కుమార్తె) ల కల్యాణం ఈ నెల 12న నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## రితేష్ - అక్షర




సూళ్ళూరుపేట వాస్తవ్యులు బద్దెపూడి ధనుంజయరెడ్డి - నీరజల కుమారుడు **రితేష్ - అక్షర** (చెన్నై వాస్తవ్యులు లింగారెడ్డి లీలాకృష్ణన్ - బాలసరస్వతిల కుమార్తె)ల పరిణయం ఈ నెల 12వ తేదీ చెన్నైలోని మేయర్ రామనాథన్ చెట్టియార్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## శ్రీజన్య - సమంత్‌రెడ్డి



ఒంగోలు డిటిసి డిఎస్పీ యర్రం శ్రీనివాసరెడ్డి - ఝాన్సీరాణిల కుమార్తె **శ్రీజన్యరెడ్డి - లలిత్ సమంత్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి - స్వరూపరాణిల కుమారుడు)ల పెళ్లి ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనెలు.

## సేత్న - రీతు



ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అనుమకొండ జగదీష్ - వైదర్భిదేవిల కుమారుడు **సేత్న - రీతు** (బెంగుళూరు వాస్తవ్యులు తొండామల్ తిప్పేస్వామి - గంగమ్మల కుమార్తె)ల వివాహం ఈ నెల 9వ తేదీ తిరుపతిలోని పాయ్ వైస్‌రాయ్ హోటల్ నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### శ్రీసిటీ-ఐఎఫ్‌ఎఫ్ పరిశ్రమల ఆధ్వర్యంలో

# కమ్యూనిటీ లైబ్రరీ ప్రారంభం




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గీతా మల్హోత్రా

శ్రీసిటీలోని ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్నాన్సెస్ (ఐఎఫ్‌ఎఫ్) పరిశ్రమ యాజమాన్యం శ్రీసిటీ పరిధిలోని ఇరుగళం గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ లైబ్రరీ అండ్ రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (రీడ్) సంస్థ భాగస్వామ్యంతో ఈ ఏర్పాటు జరిగింది. ఈనెల 12వ తేది ఉదయం ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జి ప్రకాష్ ఈ లైబ్రరీని ప్రారంభించగా, రీడ్ ఇండియా కంట్రీ డైరెక్టర్ డాక్టర్ గీతా మల్హోత్రా, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం, క్రియా యూనివర్శిటీ లైబ్రరీ సైన్స్ డీన్ డాక్టర్ రాగశ్రీ కిషోర్, ఐఎఫ్‌ఎఫ్ గ్రేటర్ ఆసియా డైరెక్టర్ (లీగల్) దాండి తంబితో పాటు ఇరుగళం గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా మల్హోత్రా మాట్లాడుతూ ఈ లైబ్రరీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇలాంటి కేంద్రాలను తమ సంస్థ భారతదేశంలోని 228 గ్రామాల్లో ఏర్పాటుచేసినట్లు ఆమె తెలిపారు. విద్య, కమ్యూనిటీ అభివృద్ధిని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా లైబ్రరీ ఏర్పాటుకు ముందుకువచ్చినట్లు ఐఎఫ్‌ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జి ప్రకాష్ పేర్కొంటూ, దీనిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో ప్రశంసించారు. ఆ గ్రామస్తులు, మహిళలు, విద్యార్థులు ఈ లైబ్రరీ ద్వారా మంచి ఫలితాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

# 'రాజన్న బడిబాట' మొదలైంది



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు

జిల్లాలో పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో తొలిరోజైన ఈనెల 12న 'రాజన్న బడిబాట' కార్యక్రమం ప్రారంభమైంది. నెల్లూరు దర్గామిట్టలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఇష్టాలేమిటో గుర్తించి వారికి అనుగుణంగా విద్యాబోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల భద్రతను విద్యలో భాగం చేయాలన్నారు. ఆ తర్వాత విద్యార్థులకు యూనిఫాం దుస్తులను, పాఠ్యపుస్తకాలను, బూట్లు, సాక్స్‌లను పంపిణీచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మొత్తం 12 లక్షలా 64 వేల పుస్తకాలు అవసరమని, ఇప్పటికే 10 లక్షలా 80వేల పుస్తకాలు పాఠశాలలకు చేర్పించామని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి జి.నరసింహారెడ్డి, పరీక్షల నిర్వహణ ఏ.డి ప్రేమ్‌కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సాహసం!

(మొదటి పేజీ తరువాయి)

పదవులలో ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తామన్న హామీ తొలిసారిగా అక్షరసత్యమైంది. వాస్తవ రూపం దాల్చింది. ఎన్నో ప్రభుత్వాల మీద, ఎందరో ముఖ్యమంత్రుల పరిపాలన మీద విశ్లేషణలు చేసి మంచి చెడులను చెప్పే రాజకీయ మేధావులు సైతం ముక్కున వేలేసుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఓ సామాజిక సాహసానికి పూనుకున్నాడు. తాను అధికారంలోకి వస్తే 50శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీలకేనన్న మాటకు ఆచరణ రూపాన్ని తన మంత్రివర్గం నుండే మొదలుపెట్టాడు. తన మంత్రివర్గంలో 60శాతం పదవులను ఈ వర్గాల వారికే కేటాయిస్తూ 'జగన్ మాట తప్పడు... మడమ తిప్పడు...' అనే నినాదాన్ని సార్ధకం చేశాడు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో సరికొత్త సామాజిక కోణాన్ని ఆవిష్కరిస్తూ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎంపిక చేసిన మంత్రివర్గం ఈరోజు జాతీయ రాజకీయాలలోనే చర్చనీయాంశంగా మారింది.

సాధారణంగా టిడిపి అధికారంలోకి వస్తే మంత్రి పదవులలో కమ్మ సామాజికవర్గానికి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెడ్డి సామాజికవర్గానికి పెద్దపీట వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ లేదు, దాని స్థానంలో వైసిపి వుంది. 'రెడ్డి' సామాజికవర్గం అంతా కూడా వైసిపికే అండగా నిలిచింది. కాబట్టి వైసిపి అధికారంలోకి వస్తే మంత్రి పదవుల్లో రెడ్లకు ప్రాధాన్యత వుంటుందని వూహించారు. అదీగాక వైసిపి 151 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే 51మంది రెడ్లే వున్నారు. అయితే జగన్ అలాంటి ఊహాగానాలకు తెరదించాడు. మొత్తం 25మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో 'రెడ్డి' సామాజికవర్గం నుండి నలుగురికే మంత్రి పదవులిచ్చారు. రెడ్లతో సమానంగా కాపులకు నాలుగు మంత్రి పదవులిచ్చి గౌరవించాడు. అగ్రవర్ణాలలో 'కమ్మ' సామాజిక వర్గానికి ఒకటి, వైశ్య సామాజిక వర్గానికి ఒకటి లెక్కన మంత్రి పదవులిచ్చాడు. అలాగే క్షత్రియుల నుండి ఒకరికి మంత్రి పదవి లభించింది. బి.సి వర్గాలకు పెద్దపీట వేస్తూ ఆ వర్గం నుండి ఏడుగురికి, ఎస్సీల నుండి ఐదుగురికి, ఎస్టీల నుండి ఒకరికి, మైనార్టీల నుండి ఒకరికి మంత్రి పదవులిచ్చి అన్నివర్గాల వారికీ తన కేబినెట్‌లో స్థానం కల్పించాడు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు ఒక్కో ఉపముఖ్యమంత్రి పదవిని కేటాయించి రాష్ట్ర రాజకీయ చరిత్రలో సరికొత్త సామాజిక కోణాన్ని ఆవిష్కరించాడు.



# విశ్వసనీయతకు బహుమానం



- యువకులే జిల్లా అమాత్యులు
- సామాజికకోణంలో జిల్లాలో తొలి బి.సి మంత్రి
- అనుభవం కంటే అభిమానంకు పెద్దపీట

2010లో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అహంకారాన్ని ఎదిరించి, ఆమె ఆజ్ఞలను ధిక్కరించి రాయలసీమ పౌరుషాన్ని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని పుణికిపుచ్చుకుని వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ నుండి బయటకొచ్చాడు. తన తండ్రి పేరు కలిసొచ్చేలా వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ(యువజన శ్రామిక రైతు కాంగ్రెస్)ను స్థాపించాడు. ఆరోజు కడప ఎంపీగా వున్న ఆయన, పులివెందుల ఎమ్మెల్యేగా వున్న ఆయన తల్లి విజయమ్మ కాంగ్రెస్‌ను వీడారు. అప్పట్లో జగన్ చేసిన పనిని చాలామంది రాజకీయ పరిజ్ఞానులు అవహేళన చేశారు. కాంగ్రెస్‌ను వీడడం తెలివితక్కువ పనిగా, రాజకీయ ఆత్మహత్యగా అభివర్ణించారు. సోనియాతో రాజీపడి వుంటే జగన్‌కు కేంద్రమంత్రి పదవి ఇచ్చేదని, ఏదో ఒకరోజు ఆమె దయతో సీఎం కూడా అయ్యుండేవాడని అన్నారు.

ఆరోజు ఒక్క జగన్‌నే కాదు, కాంగ్రెస్‌ను వదిలి ఆయన వెంట నడిచిన ప్రతిఒక్క నాయకుడిని అమాయకుల క్రిందే జమ కట్టారు. ఆరోజు జగన్ వెంట నడిచిన వాళ్ళు భవిష్యత్‌లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి 151సీట్లు వస్తాయని, జగన్ గాలిలో తామంతా ఎమ్మెల్యేలం, మంత్రులం, ఎంపీలం అవుతామని కూడా ఎవరూ ఊహించలేదు. కేవలం దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి మీదున్న అభిమానంతో జగన్ పట్ల నమ్మకముంచి ఆయన వెంట నడిచాడు.

అలా జగన్‌తో నడిస్తే ఏమవుతుందో కూడా తెలియని అయోమయ పరిస్థితుల్లో, ఆయనతో పాటు కష్టమైనా, నష్టమైనా ఎదుర్కోవడానికి సిద్ధపడి ఆయనతో కలిసి రాజకీయంగా అడుగులు వేసిన వారిలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, అలాగే మేకపాటి కుటుంబసభ్యులు ఒకరు. ఆరోజు వాళ్ళు జగన్ పట్ల చూపించిన విశ్వాసానికి, నమ్మకానికి ఈరోజు మంత్రి పదవులు వారి తలుపులు తట్టాయి. ఆనాడు జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలలో ఒకరుతప్ప మిగతా అందరూ జగన్ వెంటే నడిచినవాళ్ళే!

అలా కాంగ్రెస్‌లో వున్న ఎంపీ, ఎమ్మెల్యే పదవులను వదులుకొని వచ్చినందుకు మేకపాటి కుటుంబం నుండి ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి గౌతమ్ రెడ్డికి, అలాగే జగన్ ఆత్మాహుతిదళంగా పేరుగాంచిన టీమ్‌లో సభ్యుడు నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవులు దక్కాయి.

## అనిల్‌ను వూహించిందే..

వైసిపి అధికారంలోకి రావడం అంటూ జరిగితే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి ఖాయం అన్నది ఎప్పటినుండో వుంది. ఎందుకంటే జగన్ కోటరీలో అనిల్‌కు ముఖ్యుడనే పేరు ఉంది. బి.సి సామాజికవర్గానికి చెందిన యువకుడు కావడం కూడా కలిసొచ్చింది.

## కీలకమైన ఇరిగేషన్..

అనిల్‌కు మంత్రి పదవి ఊహించిందే అయినా ఆయనకిచ్చిన ఇరిగేషన్ శాఖను మాత్రం ఆయన కూడా వూహించి వుండడు. ఎందుకంటే రాష్ట్ర ప్రభుత్వంలో ప్రస్తుతం ఇది ఇత్యంత కీలకమైన శాఖ. జగన్ ప్రభుత్వానికి మంచిపేరొచ్చినా, చెడ్డపేరొచ్చినా ఈ శాఖ పాత్ర చాలా వుంటుంది. పోలవరం, హంద్రీనివా, వెలుగొండ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణంలో వున్న తరుణంలో అనిల్ ఈ శాఖ బాధ్యతలు చేపట్టాడు. అనిల్ నిజాయితీని, సమర్ధతను జగన్ ఎంతగా నమ్ముతున్నాడనేందుకు ఆయనకిచ్చిన ఇరిగేషన్ శాఖను బట్టే అర్ధమవుతుంది.

## తొలి బి.సి మంత్రి..

జిల్లాలో ఇంతవరకు అగ్రవర్ణాల నుండి మంత్రులైన వాళ్ళున్నారు. ఎస్సీ వర్గాల నుండి మంత్రులైన వాళ్ళున్నారు. జిల్లాలో తొలి బి.సి మంత్రి మాత్రం అనిలే! ఈ రికార్డు ఆయనకు చిరస్థాయిగా వుంటుంది. నెల్లూరు నగర అసెంబ్లీ నుండి వరుసగా మూడు దఫాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించిన బి.సి ఎమ్మెల్యే రికార్డు కూడా అనిల్‌దే!

## డాక్టర్ టు మినిస్టర్..

జీవితం సీరియల్ లాంటిది. ఎన్నో మలుపులు తిరుగుతుంటుంది. ఇప్పుడు మనం మంత్రిగా చూస్తున్న అనిల్ జీవితంలోనూ ఇలాంటి మలుపులే వున్నాయి. అనిల్ చదువుకుంటున్నప్పుడే తండ్రి పోలుబోయిన తిరుపాల్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. తల్లి సుశీలమ్మే అనిల్‌కు తండ్రిగా కూడా బాధ్యత తీసుకుని ముందుకు నడిపించింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం కాలేజీలో బిడిఎస్ పూర్తి చేసిన అనిల్... వాస్తవంగా వైద్యవృత్తిలో స్థిరపడాలి. కాని, 2008లో జరిగిన సంఘటన ఆయనను రాజకీయ రంగం వైపుకు నడిపించింది. 2008లో నెల్లూరు కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్‌గా వున్న అనిల్ చిన్నాన్న పోలుబోయిన సుధాకర్‌యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో 20వ డివిజన్‌లో ఉపఎన్నిక లొచ్చాయి. అప్పుడు నగర ఎమ్మెల్యేగా వున్న స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి ఈ డివిజన్‌కు వారి కుటుంబం నుండి అనిల్‌కుమార్‌ను నిలబడమని కోరాడు. అనిల్ అందుకు అంగీకరించాడు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా బుర్లా వెంకటేశ్వర్లుగౌడ్ నిలబడ్డప్పటికీ అనిల్ వెయ్యికిపైగా ఓట్ల మెజార్టీతో కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించాడు. ఆయన కార్పొరేటర్‌గా ఎన్నికై పట్టుమని పది నెలలు కూడా తిరక్కుండానే 2009లో అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. నియోజకవర్గం పునర్విభజనలో నెల్లూరు సిటీ కాకుండా నెల్లూరు రూరల్ నియోజకవర్గం కూడా ఏర్పడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి రూరల్ నియోజకవర్గం నుండి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో, అప్పటి ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి జిల్లాలో ఒక సీటును బిసిలకు కేటాయించాలని ఆదేశించడంతో నెల్లూరు నగరం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు సీటొచ్చింది. అయితే అప్పుడు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, మెగాస్టార్ చిరంజీవి వూపు, ఇత్యాది కారణాల వల్ల ఆ ఎన్నికల్లో అనిల్ ప్రజారాజ్యం అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేతిలో కేవలం 90ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. అయినా కూడా నియోజకవర్గాన్ని వదలకుండా అంటిపెట్టుకున్నాడు. 2010లో కాంగ్రెస్‌ను వదిలి జగన్ వెంట నడిచాడు. ఇక 2014, 2019 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుండి వరుస విజయాలు సాధించి డాక్టర్ కావాల్సిన వాడు మినిస్టర్ అయ్యాడు.

## మేకపాటికి పెద్దపీట..

2010లో వై.యస్.జగన్ వైసిపిని పెట్టినప్పుడు ఎంపీగా వున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా వున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు ఆయన వెంటే నడిచారు. తమ పదవులకు రాజీనామాలు చేసి వైసిపి అభ్యర్థులుగా మళ్ళీ ఎన్నికలకు వెళ్లి గెలిచారు. జగన్‌పై విశ్వాసంతో పదవుల త్యాగాలకు సైతం వాళ్ళు సిద్ధపడ్డారు. మేకపాటి సోదరులను జగన్ వెంట నడిపించడంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి కీలకపాత్ర పోషించాడు. 2014 ఎన్నికల్లో ఆత్మకూరు శాసనసభ్యుడిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యాడు. 2019 ఎన్నికల్లోనూ అదే నియోజకవర్గం నుండి ఘనవిజయం సాధించాడు. తన కోసం మేకపాటి కుటుంబం చూపిన విశ్వాసాన్ని, త్యాగాలను దృష్టిలో వుంచుకుని జగన్ తన కేబినెట్‌లో మేకపాటి గౌతమ్‌రెడ్డికి అవకాశం కల్పించడమే కాదు, పరిశ్రమలు, ఐ.టి., వాణిజ్యపన్నుల శాఖ వంటి కీలకమైన శాఖనిచ్చి గౌరవించాడు.

జిల్లాకు ఇచ్చిన రెండు మంత్రి పదవులు కూడా విశ్వాసానికి, విధేయతకు ఒక నాయకుడి పట్ల పెట్టుకున్న నమ్మకానికి బహుమానాలుగా చెప్పుకోవచ్చు.

# పరుగులు పెడుతున్న పాలన..

## తొలినాళ్ళలోనే పెద్దల ప్రశంసలు

ఇదేంటి... ఈ ముఖ్యమంత్రి ఇలా చేసేస్తున్నాడు... చడీచప్పుడు కాకుండా షాక్‌లిస్తున్నాడు... ఎవరూ వూహించని విధంగా వరాలు కురిపిస్తున్నాడు. సీఎం ఇలా చేస్తే ఎట్లా... ఒక అంశంపై నిర్ణయం తీసుకోవాలంటే పొద్దున నుండి సాయంత్రం దాకా సమీక్ష పేరుతో అధికారులను చావగొట్టాలి. ఈలోపు బయట ఆ అంశంపై అనుకూల ఛానల్స్‌లో చర్చలు పెట్టాలి. అంతా టెన్షన్ కలిగించాలి. సాయంత్రం... ముఖ్యమంత్రి ఫలానా పనికి ఓకే అని చెప్పాడని మంత్రివర్గ సభ్యుడు బయటకొచ్చి చెప్పాలి.... అంతే కాదు, ఈ పని ఆయన కాబట్టే చేయగలిగాడని, ఆయన దేవుడని పొగడాలి. ఈ అంశంపై పార్టీ శ్రేణులు అన్ని జిల్లాల్లో పండుగలు జరపాలి. ఈ పండుగలను జరుపడానికి జిల్లాకు ఓ నాలుగు కోట్లు కేటాయించాలి... పనులు చేయాల్సింది ఇలా...! పావలా కోడికి ముప్పావలా మసాలా అన్నట్లుగా పనికంటే కూడా పబ్లిసిటీ ఎక్కువ వుండాలి. గత 5ఏళ్లలో మనకు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు నేర్పింది ఇదే!

కాని, జగన్మోహన్‌రెడ్డి ఆ సాంప్రదాయన్ని ధిక్కరిస్తూ చాలా సాదాసీదాగా పనులు చేస్తున్నాడు. పెద్దపెద్ద నిర్ణయాలను సైతం చాలా వేగంగా తీసుకుంటున్నాడు. సీఎంగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల ధాటికి పెద్దపెద్ద రాజకీయ పండితులే నిర్ఘాంతపోతున్నారు. ప్రత్యర్థులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఈ ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించడం మొదలుకొని జగన్ ఏం చేసినా అన్నీ సంచలనాలే! ఆయన ప్రచారం మొదలుకొని ఎన్నికల ఫలితాలు... అనంతరం ప్రభుత్వ ఏర్పాటు... మంత్రి పదవుల కేటాయింపులో సామాజిక కోణం... తొలి కేబినెట్‌లో వరాల జల్లులు.... ఇలా ప్రతిదీ సంచలనమే కాదు, అన్ని వర్గాల ప్రజలను సంతోషపరిచేదిగా వుంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం రోజున ఆరు నెలల్లో మంచి సీఎంగా పేరు తెచ్చుకుంటానని చెప్పాడు. రెండు వారాలు తిరక్కుముందే సంచలనాల సీఎంగా చరిత్ర సృష్టిస్తున్నాడు.

తన పాదయాత్రలో చూసిన పలు సమస్యలను, విన్న పలువురి బాధలను



పరిష్కరించే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాడు. ఆశా వర్కర్ల జీతాలను 3వేల నుండి 10వేలకు పెంచడం, అంగన్‌వాడీ ఆయాలు, పారిశుద్ధ్య కార్మికులు, హోంగార్డుల వేతనాలు పెంచడం, ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించడం, సిపిఎస్ రద్దు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశాలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు చేయడం, దశల వారీ మద్యపాన నిషేధానికి ఆదేశాలు జారీ చేయడం, నవరత్నాలలో ప్రకటించిన 'అమ్మ ఒడి' పథకానికి జూలై నుండే శ్రీకారం చుట్టడం... అన్నింటికి మించి ఎన్నో ఏళ్ళుగా లక్షలాది మంది బాధితులను వేదనకు గురిచేస్తున్న 'అగ్రిగోల్డ్' సమస్యకు ఒకే ఒక షాట్‌లో పరిష్కారం చెప్పడం. రాష్ట్ర ప్రజలే కాదు, కాంగ్రెస్, వామపక్షాల నాయకులు కూడా ఈ నిర్ణయాలను బహిరంగంగానే ప్రశంసిస్తున్నారు. రాష్ట్రంలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో అగ్రిగోల్డ్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. గత తెలుగుదేశం ప్రభుత్వం 'అగ్రిగోల్డ్' ఆస్తులనైతే స్వాధీనం చేసుకుందిగాని, బాధితులకు డిపాజిట్లు చెల్లించే విషయాన్ని బాగా నాన్చింది. ఈలోపే ఎంతోమంది బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాని ఈ సమస్యను వేగవంతంగా పరిష్కరించే దిశగా చంద్రబాబు ఏరోజూ చొరవ చూపలేదు. కాని జగన్ తొలి కేబినెట్ మీటింగ్‌లోనే ఈ అంశానికి ప్రాధాన్యతనిచ్చి 20వేల రూపాయల డిపాజిట్లన్నీ వెంటనే చెల్లించాలంటూ దానికి 1,150 కోట్లు విడుదల చేశారు. అంతేకాదు, అగ్రిగోల్డ్ ఆస్తులు వేలం వేసి 20వేల రూపాయలపైన వున్న డిపాజిట్లను కూడా తొందరగా చెల్లించేందుకు శ్రీకారం చుట్టారు. ఇక పరిపాలనాపరంగా చూస్తే అంచనాలను విపరీతంగా పెంచిన ప్రాజెక్టుల పనులను తాత్కాలికంగా ఆపు చేయించారు. రివర్స్ టెండర్ ద్వారా కాంట్రాక్ట్ వ్యవస్థలో పారదర్శకత నెలకొల్పడానికి నడుం బిగించారు. అలాగే విద్యుత్ కొనుగోలు ఒప్పందాల పునఃసమీక్షకు శ్రీకారం చుట్టి గత ప్రభుత్వం చేసిన ఎంఓయులలోని అక్రమాలను తవ్వితీయబోతున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో సిబిఐ రాష్ట్రంలో ప్రవేశించకుండా జారీ చేసిన జి.ఓను రద్దు పరచి మా పాలన పారదర్శకంగా ఉండబోతుందని, ఏ తప్పు చేసినా నిర్భయంగా విచారించుకోవచ్చునని చెప్పకనే చెప్పారు. ప్రజలకు మంచి పరిపాలన అందించాలంటే 40ఏళ్ల అనుభవం అవసరం లేదని, మంచి బుద్ధి, మంచి ఆలోచన, నమ్మిన ప్రజలకు మేలు చేయాలన్న తపన వుంటే చాలని చాటుతున్నాడు జగన్!

# ఏపీలో టీడీపీని మింగేయనున్న బీజేపీ?

○ అప్పుడే పార్టీ మారడానికి సన్నాహాలు చేస్తున్న నేతలు

**ఎన్నికలు అయిపోయాయి. ఫలితాలు వచ్చాయి. అటు వైసిపి వాళ్ళకు షాక్... ఇటు టీడీపీ వాళ్ళకూ షాక్. వైసిపి వాళ్ళు వూహించినదానికంటే ఎక్కువ సీట్లు రాగా, టిడిపివాళ్ళకు కలలో కూడా వూహించుకోలేనంతటి పరాజయం ఎదురైంది. రాష్ట్రంలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిపోయింది. కొంతకాలం పాటు రాష్ట్రంలో రాజకీయ చర్చలనేవే వుండకూడదు.**

కాని, విచిత్రంగా రాష్ట్రంలో భలే రాజకీయ చర్చలు నడుస్తున్నాయి. అదేమంటే ఈ ఎన్నికల్లో ఓటమిపాలైన చాలామంది టిడిపి మాజీమంత్రులు మాజీఎంపీలు, మాజీఎమ్మెల్యేలు తెలుగుదేశంను వదిలేసి బీజేపీలో చేరడానికి ప్రయత్నిస్తున్నారని. ఇది నిజమే! ప్రస్తుతం వీళ్ళకు బీజేపీలో చేరడం తప్పితే ప్రత్యామ్నాయ మార్గం లేదు. జగన్ గేట్లు తెరిస్తే వైసిపిలో చేరడానికి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలు 23మందిలో సగం మందికిపైగానే సిద్ధంగా వుంటారు. కాని, చంద్రబాబులా జగన్ ఫిరాయింపులను ప్రోత్సహించడు. ఇప్పుడిప్పుడే ఆయన ఇలాంటివాటిని ప్రోత్సహించకపోవచ్చు. ఈ విషయాన్ని ఆయన 13వ తేదీ అసెంబ్లీలో కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు కూడా! అలాచేస్తే తనకూ చంద్రబాబుకు తేడా ఏముందని చెప్పి, చంద్రబాబును తలవంచుకునేలా చేశాడు. ఇప్పుడు జగన్ దృష్టంతా పరిపాలన మీదే వుంది!

అయితే టీడీపీలో వున్న వాళ్ళకు ఏదో ఒక ప్రత్యామ్నాయ మార్గం కావాలి. తెలుగుదేశంలో ఇక ఎక్కువకాలం నిలవలేరు. చంద్రబాబుకు వయసు పైనపడుతుంది. అదీగాక ఈ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయంతో ఆయన సత్తా ఏంటనేది ఆ పార్టీ నాయకులకు తెలిసొచ్చింది. చంద్రబాబుకు సొంతంగా పార్టీని గెలిపించేంత ఛరిష్మా లేదని తేలిపోయింది. ఆయనను నమ్ముకుని పార్టీలో కొనసాగితే రాజకీయంగా తమ మనుగడ కష్టమవుతుందనే ఉద్దేశ్యంతో టిడిపి నాయకులున్నారు. అందుకే ఆ పార్టీకి చెందిన మాజీమంత్రులు, ఇతర నాయకులు బీజేపీలో చేరడానికి సన్నద్ధమవుతున్నారు. కేంద్రంలో బీజేపీనే అధికారంలో వుండడం, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా బీజేపీతో సన్నిహితంగా వున్న దృష్ట్యా బీజేపీలో చేరితేనే తమ రాజకీయ భవిష్యత్ క్షేమంగా వుంటుందని భావిస్తున్నారు. ఈ దృష్ట్యా త్వరలోనే తెలుగుదేశం నుండి బీజేపీకి భారీగా వలసలు చోటుచేసుకోవచ్చని సమాచారం.






## ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా దైవం

### శ్రీమతి బత్తల సునీతమ్మ

(లేట్ బత్తల కృష్ణారెడ్డి గారి సతీమణి)

తేది. 31.05.2019న పరమపదించినారు.

వారి పవిత్ర ఆత్మకి శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

బత్తల లక్ష్మీధర్‌రెడ్డి - జ్యోతి

బత్తల హేమంత్‌కుమార్‌రెడ్డి - స్వప్న

బత్తల మురళీధర్‌రెడ్డి - వనిత

మనుమళ్ళు మరియు మనుమరాలు

విష్ణుప్రణీత్‌రెడ్డి, దివ్య, భువనేష్‌రెడ్డి, భానుతేజరెడ్డి, గగన్‌దీప్‌రెడ్డి

**ఉత్తరక్రియలు:** వారి ఉత్తరక్రియలు తేది. 20.06.2019 గురువారం ఉదయం 11గంటలకు నెల్లూరు లెక్చరర్స్ కాలనీ, మాగుంట లే అవుట్ ఎక్స్‌టెన్షన్‌లోని 'కౌసల్య నిలయం' అపార్ట్‌మెంట్స్ నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com